# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :196 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 05-10-2024 | పేజీలు:4 వెల: 2.00


## 16మంది పోలీసు అధికారులపై వేటు

హైదరాబాద్,ఇసుక అక్రమ దందాను నియంత్రించడంలో విఫలమైన పోలీసులపై ఆ శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. మల్టీ జోన్ - 2 పరిధిలోని తొమ్మిది జిల్లాల్లో బాధ్యులను గుర్తించి వారిపై వేటు వేశారు. ఏకంగా ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్ఐలను వేకెన్సీ రిజర్వ్ (వీఆర్)కు పంపించారు. ఈ మేరకు జోన్ ఐజీపీ వి.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.రాష్ట్ర నిఘా వర్గాల నివేదికలు, విచారణల అధారంగా ఈ చర్యలు చేపట్టినట్లు ఐజీ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. వేటు పడిన వారిలో సంగారెడ్డి రూరల్, తాండూరు రూరల్, తాండూరు టౌన్ ఇన్స్పెక్టర్లతో పాటు వీపనగండ్ల, బిజినేపల్లి, తెలకపల్లి, వంగూరు, ఉప్పునూతల, సంగారెడ్డి రూరల్, పెద్దేముల్, యాలాల్, తుంగతుర్తి, ఆత్మకూర్ (ఎస్), పెన్పహాడ్, వాడపల్లి, హాలియా ఎస్ఐలు ఉన్నారు.గతంలో ఇదే వ్యవహారంలో ఒక ఇన్స్పెక్టర్, 14 మంది ఎస్ఐలను బదిలీ చేశారు. వీరిలో కొందరు ఇసుక అక్రమ దందా ముఠాలతో చేతులు కలిపినట్లు గుర్తించారు.

## రాష్ట్రంలో మహిళలకు కరువైన భద్రత...



హైదరాబాద్: రాష్ట్రంలో బాలికలు, మహిళలకు భద్రత కరువైందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు (హరీష్ రావు) భద్రత కల్పించాల్సిన ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదని అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని హెచ్చరించినా నిర్లక్ష్యం వీడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజు ఎక్కడో ఒకచోట అత్యాచార ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇద్దరు మైనర్ బాలికలపై జరిగిన అత్యాచార ఘటన వార్త నన్ను తీవ్రంగా కలచివేసింది. హెూం మంత్రిత్వ శాఖను కూడా తానే చేసినప్పటికీ రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షించడంలో సీఎం రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. ఇందిరమ్మ రాజ్యం అని ఊదరగొట్టడమే కానీ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యతలలో మహిళలకు భద్రత లేదని తేటతెల్లమయిందంటూ ఎక్స్' వేదికగా.'రాష్ట్రంలో బాలికలకు, మహిళలకు భద్రత కరువైంది. భద్రత కల్పించవలసిన ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోంది. ఇద్దరు మైనర్ బాలికలపై జరిగిన అత్యాచార ఘటన వార్త నన్ను తీవ్రంగా కలచివేసింది. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదని సాక్షాత్తు అసెంబ్లీ వేదికగా ఈ ప్రభుత్వాన్ని హెచ్చరించినా నిర్లక్ష్యం వీడలేదు. ఫలితంగా ప్రతిరోజూ ఎక్కడో ఒక చోట అత్యాచార ఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. 9 కాంగ్రెస్ పాలనలో రెండు వేలకు పైగా నెలల అత్యాచారాలు జరిగితే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.హెూం మంత్రిత్వ శాఖను కూడా తానే చేసినప్పటికీ రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షించడంలో సీఎం రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారు. గత ప్రభుత్వం మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. షీ టీమ్స్, సఖి భరోసా కేంద్రాలు ఏర్పాటుచేసి భద్రత కల్పించింది. కానీ ఇందిరమ్మ రాజ్యం అని ఊదరగొట్టడమే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యతలో మహిళా భద్రత లేదని తేటతెల్లమైంది. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి శాంతి భద్రతల పర్యవేక్షణకు చర్యలు చేపట్టాలి. మైనర్ బాలికలపై అత్యాచారానికి గురైన దుర్మార్గ కఠిన శిక్షలు పడేలా డిమాండ్ చేస్తున్నారు.

## తిరుమల లడ్డూ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం..

న్యూఢిల్లీ, తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం తయారీలో ఉపయోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందన్న ఆరోపణలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన సిట్ దర్యాప్తునే కొనసాగించాలా.. లేక కేంద్రం విచారణ జరిపించాలా అన్న అంశంపై సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్ లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది.

ఏపీ ప్రభుత్వం తరపున ముకుల్ రోహత్గి వాదనలు వినిపించగా.. కేంద్రం తరపున సొలిసిటరీ జనరల్ తుషార్ మెహతా, టీటీడీ తరపున సిద్ధార్థ్ లూథ్రా, వైవీ సుబ్బారెడ్డి తరపున కపిల్ సిబల్ తమ వాదనలు వినిపించారు.అన్ని పక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు కీలక నిర్ణయాన్ని వెల్లడించింది. లడ్డూ కల్తీ వ్యవహారంపై నిగ్గుతేల్చేందుకు స్వతంత్ర దర్యాప్తునకు సుప్రీంకోర్టు ఆదేశించింది. సీబీఐ పర్యవేక్షణలో ఐదుగురు సభ్యులతో దర్యాప్తు చేయాలని, దర్యాప్తు బృందంలో కేంద్రం నుంచి ఇద్దరు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇద్దరు అధికారులు, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఒక అధికారి ఉండాలని సుప్రీంకోర్టు సూచించింది. తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారం భక్తుల విశ్వాసానికి సంబంధించిన అంశమని, పొలిటికల్ డ్రామాలకు అనుమతి ఇవ్వమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.కేంద్ర ప్రభుత్వం తరపున భారత సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ.. తిరుమల వేంకటేశ్వర స్వామికి దేశవ్యాప్తంగా భక్తులు ఉన్నారు.. లడ్డూకు ఎంతో ప్రాముఖ్యత ఉందని అన్నారు. లడ్డూలో కల్తీ నెయ్యి వాడారనే ఆరోపణల్లో వాస్తవం ఉంటే అది ఆమోదయోగ్యం కాదని తుషార్ మెహతా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ బృందంపై తమకు ఎలాంటి



అభ్యంతరం లేదని, కానీ, దర్యాప్తుపై భక్తుల్లో మరింత విశ్వాసం కలిగించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ను సీనియర్ కేంద్ర అధికారి పర్యవేక్షించాలని ఆయన కోర్టుకు ప్రతిపాదించారు.సుప్రీంకోర్టు విచారణ సందర్భంగా న్యాయవాది కపిల్ సిబల్ వాదిస్తూ.. ముఖ్యమంత్రి ప్రకటన చేయకుంటే అది వేరే విషయం. నిష్పాక్షికమైన, స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాల్సిన అవసరాన్ని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఏపీ ప్రభుత్వం తరపున న్యాయవాది రోహిత్గీ బదులిస్తూ.. ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సెప్టెంబర్ నెలలో చేసిన ప్రకటనకు, జూలైలో వెలువడిన ఈ కేసు నివేదికకు సంబంధం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారని, మీడియా కేవలం నాలుగు లైన్లు మాత్రమే సందర్భానుసారంగా తీసుకుందని ఆయన కోర్టుకు దృష్టికి తీసుకెళ్లారు.

## సుప్రీంపై టీటీడీ మాజీ చైర్మన్లు ఏమన్నారంటే ?

తిరుమల : తిరుపతి లడ్డూ (తిరుపతి లడ్డూ) కల్తీ వ్యవహారంలో సుప్రీం కోర్టు ఇచ్చిన విషయాన్ని టీటీడీడీ మాజీ చైర్మన్లు ??ఎంపీ వైవీ సుబ్బారెడ్డి (ఎంపీ వైవీ సుబ్బారెడ్డి) , భూమన కరుణాకర్‌రెడ్డి (భూమన కరుణాకర్ రెడ్డి) స్వాగతించారు. ప్రత్యేక దర్యాప్తునకు కోర్టు ఆదేశాలు ఇవ్వడం ఆనందంగా ఉందని తెలియజేసింది. విచారణ వల్ల వాస్తవాలు వెలుగులోకి వస్తాయని భూమన కరుణాకర్‌రెడ్డి. కేవలం దురుద్దేశ ఆలోచనలతో తమపై కూటమి నేతలు నిందలను వేశారని , ఇది అన్యాయమని అన్నారు.లడ్డూపై ఆరోపణల ద్వారా 140 కోట్ల హిందూవుల మనోభావాలను, ఆలయ ప్రతిష్టకు మచ్చ వచ్చే విధంగా చూపబడింది. లడ్డూ తయారిలో నెయ్యికి బదులుగా జంతువుల కొవ్వును వాడారని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై సీబీఐ విచారణ, సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని మొదటి నుంచి కోరుతున్నామని చెప్పారు. ఈరోజు భగవంతుడు రూపంలో సుప్రీంకోర్టు అదే రకంగా ఆదేశాలు ఇవ్వడం ఆనందంగా ఉందని అన్నారు. సుప్రీం నిర్ణయంపై కొందరు తమను విమర్శించిన వారు కూడా స్వాగతించినట్లు నటిస్తున్నారని,

తమ హయాంలో ఏఆర్ కంపెనీ బిడ్లు కూడ వేయలేదు..

తాము అధికారంలో ఉన్న ఐదేండ్లలో ఏఆర్ కంపెనీ నెయ్యి సరఫరాకు టెండర్లలో బిడ్లు కూడా వేయలేదని వైవీ సుబ్బారెడ్డి ఉన్నారు. ఆ కంపెనీ



నెయ్యి సరఫరా చేయలేదని స్పష్టం చేశారు. ఎన్నికల సందర్భంగా కోడ్ అమలులో ఉన్న సమయంలో నెయ్యి టెండర్లు పిలిచారు. ఆ సమయంలో ఉన్న అధికారులు తీసుకున్న నిర్ణయంపై విచారణ చేపట్టాలని మొదటి నుంచి తాము డిమాండ్ చేస్తున్నామన్నారు.ఏఆర్ సప్లై చేసిన నెయ్యిలో కల్తీ జరిగిందా లేదా , జరిగితే ఎవరి హయాంలో జరిగింది, ఏ పదార్థాలు కల్తీ జరిగాయి అనే విషయాలు విచారణలో వస్తాయని, ఆరోపణలు మీకు న్యాయం జరుగుతాయని భావిస్తున్నామని చెప్పారు.

## మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతలపై ప్రధాని నరేంద్ర మోడీ ఉన్నత స్థాయి భద్రతా సమావేశం!



న్యూఢిల్లీ,పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తత దృష్ట్యా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఉన్నత స్థాయి భద్రతా సమావేశాన్ని పిలిచి ప్రస్తుత పరిణామాలపై చర్చించారు.ఈ సమావేశంలో ఇజ్రాయెల్‌పై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి దాడి తరువాత పెరిగిన శత్రుత్వాలపై హెూం మంత్రి, రక్షణ మంత్రి, విదేశాంగ మంత్రి, ఆర్థిక మంత్రి, జాతీయ భద్రతా సలహాదారుతో కూడిన కమిటీతో పాటు ప్రధాని చర్చించారు. దౌత్యం, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని భారతదేశం అన్ని పార్టీలను కోరింది. మధ్యప్రాచ్యంలో యుద్ధం చమురు, పెట్రోలియంలతో పాటు దాని ఉత్పత్తుల వాణిజ్య షిప్పింగ్, సరఫరా గొలుసులపై ప్రభావం చూపుతుందని కూడా సమావేశంలో చర్చించారు. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా ఎర్ర సముద్రంతోపాటు ఏడెన్ గల్ఫ్ లోని కీలక మార్గాల్లో విస్తృత వాణిజ్య అంతరాయాలకు భారతదేశం సిద్ధంగా ఉందని అభిప్రయపడ్డారు. ఈ వివాదం సరుకు రవాణా ఛార్జీలలో గణనీయమైన పెరుగుదలకు దారితీయవచ్చు. లెబనాన్ లోని ఇరాన్ మద్దతుగల హిజ్బుల్లా యెమెన్ హౌతీ తిరుగుబాటుదారులతో సన్నిహిత సంబంధాలను కలిగి ఉంది. వారు ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఏడెన్ మార్గాల ద్వారా వస్తువులను రవాణా చేసే వ్యాపార నౌకలపై చాలా దాడులకు బాధ్యత వహిస్తారు. గత ఏడాది అక్టోబర్‌లో ఇజ్రాయెల్, హమాస్ మధ్య యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి ఇరాన్ మద్దతుగల హౌతీ మిలీషియా ఈ ప్రాంతంలో ప్రపంచ వాణిజ్యానికి అంతరాయం కలిగించింది. ఇది భారతదేశంలో పెట్రోలియం ఎగుమతులపై మాత్రమే ప్రభావం చూపింది.గత ఏడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై పాలస్తీనా సాయుధ సమూహం హమాస్ దాడి చేసినప్పటి నుండి ఇజ్రాయెల్ నిరంతరం గాజాపై బాంబు దాడి చేస్తోంది. ఇందులో 40 వేల మందికి పైగా మరణిం చారు. లెబనాన్ లోని ఇరాన్ మద్దతుగల సాయుధ సమూహం హిజ్బుల్లా, పాలస్తీనాకు మద్దతుగా వచ్చినందుకు ఇజ్రాయెల్‌పై దాడి చేయడం ప్రారంభిం చింది. దీని కారణంగా, ఇజ్రాయెల్ లెబనాన్‌పై లక్షిత భూదాడులను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగానే హిజ్బుల్లా యొక్క 7 కమాండర్లను చంపింది.

## 'దసరా కానుకగా టీజీపీఎస్సీ గ్రూప్ 4 ఫలితాలు ప్రకటించాలి'




హైదరాబాద్, అక్టోబర్ 4: తెలంగాణ గ్రూప్ 4 పరీక్ష తుది ఫలితాలను తక్షణమే ప్రకటించాలని అక్టోబరు 3న నాంపల్లిలోని టీజీపీఎస్సీ, గాంధీభవన్‌ల వద్ద నిరుద్యోగులు ఆందోళన చేపట్టారు. ఫలితాలు ప్రకటించి, వెంటనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. గ్రూప్-4 నియామకాలిచ్చి మా జీవితాల్లో వెలుగులు నింపండి.. అంటూ వందల మంది అభ్యర్థులు నినాదాలు చేశారు. వందలాది మంది నిరుద్యోగులు టీజీపీఎస్సీ కార్యాలయం వైపుకు దూసుకు రావడంతో హుటాహుటీన పోలీసు బలగాలు వారిని అడ్డుకున్నాయి. అనంతరం వారంతా గాంధీభవన్ వైపు వెళ్లారు. అక్కడ పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలో నిరసన కార్యక్రమాన్ని కొనసాగించారు. గ్రూప్ 4 పోస్టులకు ధ్రువపత్రాల పరిశీలన పూర్తయి రెండు నెలలైనా ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దసరా కానుకగా తుది ఫలితాలు ప్రకటించాలని రేవంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అయితే అక్కడికి కూడా వచ్చిన పోలీసులను కొందరు అభ్యర్థులను అదుపులోకి తీసుకోవడంతో పరిస్థితి సద్దుమణిగింది. కాగా మొత్తం 8,180 గ్రూప్ 4 పోస్టుల భర్తీకి ఈ నియామక ప్రక్రియ చేపట్టారు. 1:3 నిష్పత్తిలో జనరల్ మెరిట్ జాబితాను విడుదల చేసి సర్టిఫికెట్ వెరిఫికేషన్ కూడా పూర్తి చేశారు. అయితే ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించకపోవడంపై హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లను విచారించిన న్యాయస్థానం గ్రూప్-4 పోస్టుల తుది ఫలితాలు హైకోర్టు తీర్పుకు లోబడి ఉండాలని ఆదేశించింది.

తెలంగాణ లాసెట్ చివరి విడత సీట్ల కేటాయింపు పూర్తి

తెలంగాణ లాసెట్ చివరి విడత కౌన్సెలింగ్ పూర్తైంది. చివరి విడత సీట్లను గురువారం అభ్యర్థులకు కేటాయించారు. కన్వీనర్ కోటా కింది 3,158 సీట్లుండగా, వీటిలో 2,991 మందికి సీట్లు దక్కాయని ప్రవేశాల కన్వీనర్ ప్రొఫెసర్ పి.రమేష్‌బాబు తెలిపారు. తొలివిడతలో 5,363 మంది సీట్లు పొందారు. వారిలో 3,374 మంది ఆయా కళాశాలల్లో రిపోర్టు చేశారని పేర్కొన్నారు. తాజాగా సీట్లు పొందిన వారు అక్టోబర్ 7వ తేదీలోపు ట్యూషన్ ఫీజు చెల్లించి ఆయా కాలేజీల్లో ధ్రువపత్రాలతో రిపోర్టు చేయాలని సూచించారు.

ఏపీ టెట్‌కు 87.6 శాతం మంది హాజరు.. అక్టోబర్ 21 వరకు ఆన్‌లైన్ పరీక్షలు

ఏపీ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలి రోజు 87.6 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. మొదటి రోజు 23,301 మందికి గాను 20,413 మంది పరీక్ష రాశారు. రెండు సెషన్లుగా నిర్వహించిన ఈ పరీక్షకు ఉదయం 12,732 మందికి 11,091 హాజరవగా.. మధ్యాహ్నం 10,569 మందికి గానూ 9,322 మంది హాజరయ్యారు. అక్టోబర్ 21 వరకు టెట్ పరీక్షలు జరుగుతాయి.

## పలు ఎక్స్‌ప్రెస్‌వేలో భారీగా టోల్ ఛార్జీల పెంపు..!

న్యూఢిల్లీ,అక్టోబర్4: యమునా ఎక్స్‌ప్రెస్‌వే టోల్ ఛార్జీలు బుధవారం రాత్రి నుండి యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై కొత్త టోల్ రేట్లు అమల్లోకి వచ్చాయి. దీంతో గ్రేటర్ నోయిడా-ఆగ్రా మధ్య ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రయాణం 12 శాతం మేర పెరిగింది.కొత్త టోల్ రేట్లు యమునా అథారిటీ 82వ బోర్డు మీటింగ్ ఆర్డర్ జారీ చేసిన తర్వాత, యమునా ఎక్స్‌ప్రెస్‌వే ఆపరేటింగ్ కంపెనీ జేపీ ఇన్‌ఫ్రాటెక్ కొత్త టోల్ రేట్లను అమలు చేసింది.యమునా ఎప్రెస్‌వే టోల్ రేట్లు పెంపు 26 సెప్టెంబర్‌న జరిగిన యమునా అథారిటీ 82వ బోర్డు సమావేశంలో యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై టోల్ రేట్లను పెంచే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. దీని కింద ఎక్స్‌ప్రెస్‌వేపై టోల్‌ను ఐదు శాతం నుండి 12 శాతానికి పెంచారు. ఈ పెంపుదల అక్టోబరు 1 నుంచి చేయడానికి ఆమోదం పొందింది.అయితే కార్యాలయ ఉత్తర్వుల జారీలో జాప్యం కారణంగా, అక్టోబర్ 2 అర్ధరాత్రి నుండి అమల్లోకి వచ్చింది. కొత్త టోల్ రేట్లు అమలులోకి రావడంతో ఎక్స్‌ప్రెస్‌వేలో ప్రయాణించే డ్రైవర్లు తదనుగుణంగా టోల్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. యమునా అథారిటీ నుండి టోల్ రేటు పెంపు ఉత్తర్వులు అందిన తరువాత, బుధవారం అర్ధరాత్రి నుండి కొత్త రేట్లు అమలులోకి వచ్చినట్లు యమునా ఎక్స్‌ప్రెస్‌వే యొక్క జెవార్ టోల్ ప్లాజా మేనేజర్ జెకె శర్మ తెలిపారు.

## కాంగ్రెస్ ఆరోపణలను ఖండించిన కుమారస్వామి

విశాఖ:విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై కాంగ్రెస్ పార్టీ చేసిన ఆరోపణలను కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి ఖండించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించారని ఆరోపిస్తూ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.ఈ ఆరోపణలకు స్పందిస్తూ, కుమారస్వామి గురువారం ఎక్స్ ద్వారా వెల్లడించిన తన స్పందనలో, ఎన్డీఏ ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మేస్తోందనే ఆరోపణలు నిరాధారమని, సత్యదూరమని స్పష్టం చేశారు.అతను తెలిపిన వివరాల ప్రకారం, కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించిన 48 గంటల్లోనే తిరిగి వారిని నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. సెప్టెంబర్ 27న తొలగించిన 4,200 మంది కాంట్రాక్ట్ కార్మికులను 29వ తేదీన మళ్లీ విధుల్లోకి తీసుకున్నామని ఆయన వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ స్వప్రయోజనాలు , ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం ఈ అంశాన్ని వాడుకోవడం మానుకోవాలని ఆయన హితవు పలికారు.ఇక కాంట్రాక్ట్ కార్మికుల పరిస్థితి గురించి మాట్లాడతే, ఇప్పటివరకు రద్దు చేసిన 3,700 మంది కాంట్రాక్ట్ లేబర్ పాసులను త్వరలో ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా పునరుద్ధరించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆర్ఐఎన్ఎల్ యాజమాన్యం స్పష్టం చేసింది. అంతేకాక, కార్మికుల బయోమెట్రిక్ డేటాను త్వరలో పునరిద్ధరించనున్నామని కుమారస్వా



మి తెలిపారు.గేట్ పాస్ వ్యవస్థతో పాటు, అవసరమైన సౌకర్యాలను కొనసాగించేందుకు అన్ని పక్షాలీ చర్చల సమయంలో అంగీకరించాయని ఆయన చెప్పారు. మొత్తం మీద, ఎన్డీఏ సర్కార్ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మేస్తోం దనే ఆరోపణలు అసత్యం అని, ప్రభుత్వ రంగ సంస్థలను సమర్ధంగా నిర్వహి ంచడం ద్వారా గత మూడేళ్లలో వాటి షేర్ విలువ అద్భుతంగా పెరిగిందని మంత్రి కుమారస్వామి పేర్కొన్నారు. ఇది కాకుండా, బాధిత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకు ంటుందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు.

## పబ్లిక్ సర్వీస్ కమిషన్ వద్ద పోస్టర్ల కలకలం..




హైదరాబాద్ : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎదుట గ్రూప్-1 పోస్టర్లు కలకలం సృష్టించాయి. కమిషన్ కార్యాలయం గోడలు, గేట్లపై కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడి ఫొటోలతో కూడిన పోస్టర్లు వెలిశాయి. నాంపల్లిలోని టీజీపీఎస్సీ ఎదుట, హైదరాగూడలోని తెలుగు అకాడమీ ఎదుట గుర్తు తెలియని వ్యక్తులు పోస్టర్లు అతికించారు. ఆ పోస్టర్లలో తెలుగు అకాడమీ పుస్తకాలు పోటీ పరీక్షలకు ప్రామాణికంగా లేవని.. ప్రభుత్వం కోర్టుకు చెప్పిన నేపథ్యంలో ఎవరూ కొనవద్దని విజ్ఞప్తి చేశారు.అలాగే టీజీపీఎస్సీ ఎదుట నేను ఒక నియంత అంటూ పోస్టర్లు దర్శనమిచ్చాయి. అంతేకాదు గ్రూప్-1లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 150 ప్రశ్నలను ఎందుకు సిద్ధం చేయలేదని సిగ్గు సిగ్గు అని పోస్టర్లు వెలిశాయి. ఉదయాన్నే పబ్లిక్ సర్వీస్ కమిషన్ ముందు ఈ పోస్టర్లు దర్శనం ఇవ్వడంతో కమిషన్ సిబ్బంది దీనిని తొలగించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## సంపాదకీయం

శనివారం 05-10-2024

# పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు

పశ్చిమాసియా మరోసారి ప్రత్యక్ష యుద్ధ ప్పు సుడిగుండంలోకి జారుకుంటున్నది. ఓ పక్క ఇజ్రాయెల్, మరోపక్క ఇరాన్ కలబడుతుండటం ప్రపంచాన్ని కలవరపరుస్తున్నది. హిజ్బొల్లా అగ్రనేత నస్రల్లాను వైమానిక దాడిలో ఇజ్రాయెల్ తుదముట్టించినప్పటి నుంచి ఉద్రిక్తతలు కుత కుత ఉడుకుతున్నాయి. తర్వాత ఇజ్రాయెల్ దక్షిణ లెబనాన్‌లో భూతల యుద్ధం ప్రారంభించింది. హిజ్బొల్లా స్థావరాలు, నేతలు లక్ష్యంగా దాడులు జరుపుతున్నది. ఇటీవల పలువురు ఇరాన్ సీనియర్ సైనికాధికారులనూ డ్రోన్ దాడుల్లో ఇజ్రాయెల్ చంపేసింది. ఈ పరిణామాలను జీర్ణించుకోలేకపోతున్న ఇరాన్ మంగళవారం రాత్రి సుమారు 200 క్షిపణులతో ఇజ్రాయెల్‌పై విరుచుకుపడింది. ఇరాన్ ఇలా ప్రత్యక్ష దాడికి దిగడం పశ్చిమాసియాలో ఇప్పటికే దావానలంలా వ్యాపిస్తున్న విద్వేషాగ్నికి ఆజ్యం పోసినట్టయింది. దీనిని సాకుగా తీసుకొని ఇరాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడబోతున్నది. లెబనాన్, యెమెన్‌లో ఇరాన్ అనుకూల గెరిల్లా దళాలు ఈ సరికే ఇజ్రాయెల్‌తో క్షిపణుల యుద్ధం నెరపుతున్నాయి. ఇవన్నీ వెరసి ఎటు దారి తీస్తాయోననే ఆందోళన అంతకంతకూ పెరుగుతున్నది. ప్రస్తుత పశ్చిమాసియా సంక్షోభం వెనుక ఏడు దశాబ్దాలకు పైగా సాగిన పరిణామాల నీడలున్నాయి. పశ్చిమదేశాల ఆధిపత్యవాదం, స్థానికంగా ఉండే మతవాదం, చమురు కలగలిసి మందుగుండుగా తయారైన పరిస్థితి. ఒకప్పుడు పాలస్తీనా సమస్య చుట్టూ పశ్చిమాసియా పరిభ్రమించినా కాలక్రమంలో అరబ్బు దేశాలు దౌత్యపరమైన పరిష్కారం వైపు మొగ్గడం మొదలుపెట్టాయి. యుద్ధోన్మాదం పట్ల ప్రజల్లో పెరిగిన వ్యతిరేకత, ప్రగతి సంక్షేమాల పట్ల పెరిగిన సానుకూలత అందుకు కారణం. ఈ నేపథ్యంలో ఇరాన్ ఒక్కటే పాలస్తీనా మద్దతుదారుగా మిగిలిపోయింది. సిరియా, లెబనాన్, యెమెన్‌లలోని తన మద్దతుదారుల ద్వారా ఇజ్రాయెల్‌పై పరోక్ష యుద్ధం కొనసాగిస్తున్నది. ఇప్పుడది ముదిరిపోయి ప్రత్యక్ష యుద్ధంగా పరిణమిస్తున్నది. గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న నరమేధంలో పదుల వేల సంఖ్యలో జనం చచ్చిపోతున్నారు. లక్షల సంఖ్యలో కాందిశీకులు గూడు చెదిరి అగచాట్లు పడుతున్నారు. మరోవైపు దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెలీ దళాలు భూతల యుద్ధం మొదలుపెట్టాయి. అవి చాలవన్నట్టుగా ఇప్పుడు పులి మీద పుట్రలా యుద్ధం వచ్చి పడుతున్నది. ఇది రెండు దేశాలకు పరిమితమైన యుద్ధంగా ఉండబోదని కచ్చితంగా చెప్పవచ్చు. అదేవిధంగా దీని ప్రభావం ప్రపంచంలోని దేశాలన్నిటిపైనా ఎంతో కొంత ఉండి తీరుతుంది. నిన్నటిదాకా నేల చూపులు చూసిన అంతర్జాతీయ చమురు ధర ఒక్కసారిగా పైపైకి ఎగబాకుతుండటమే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా నౌకా రవాణా ఇప్పటికే భయం నీడలో సాగుతున్న సంగతి తెలిసిందే. పశ్చిమాసియా సంక్షోభమంతటికీ పాలస్తీనా సమస్య కేంద్రబిందువు లాంటిది. ఆ సమస్యకు రెండు దేశాల సూత్రమే ఏకైక పరిష్కార మార్గం. కానీ, యుద్ధంతో శాంతిని కొనుక్కోవాలని ఇజ్రాయెల్ చూస్తున్నది. పాలస్తీనా అస్తిత్వాన్ని అంగీకరించి వారి భూ భాగాన్ని వారికి సంపూర్ణ సార్వభౌమాధికారంతో అప్పగించడమే అసలు సిసలు శాంతికి బాటలు వేస్తుందని ఇజ్రాయెల్ గుర్తించాలి. పాలస్తీనా సమస్య పర్యవసానంగానే ప్రస్తుత యుద్ధం రాజుకుంటున్నది. ఇది ఏ మాత్రం ఉపేక్షించదగిన విషయం కాదు. ఇజ్రాయెల్ అప్రకటిత అణ్వస్త్ర దేశమైతే ఇరాన్ అనుమానిత అణ్వస్త్ర దేశం అనేది ఈ సందర్భంగా గుర్తుంచుకోవాలి. ఈ రెండు దేశాలు కత్తులు దూసుకోవడం ప్రపంచానికి ఏమంత శ్రేయస్కరం కాదు. తక్షణమే ఐక్యరాజ్య సమితి విపత్కర పర్యవసానాలతో కూడిన ప్రస్తుత యుద్ధాన్ని ఆపేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేయాలి. ఇజ్రాయెల్, అమెరికా చిత్తశుద్ధితో సహకరిస్తేనే శాశ్వత శాంతి సాధ్యమవుతుంది.

# కార్పొరేట్ సంస్థలో పని భారం, పని ఒత్తిడి



హైదరాబాద్,అనేక కార్పొరేట్ సంస్థల్లో పని భారం, పని ఒత్తిడి విపరీతంగా పెరుగుతున్న కారణంగా అనారోగ్యాలు, ఆకస్మిక మరణాల సంఖ్య పెరుగుతున్నట్టు కార్మిక విభాగాలు, కార్మిక సంఘాల అధ్య యనాలు తెలియజేస్తున్నాయి. పుణేలో ఎర్నెస్ట్ అండ్ యంగ్ అనే సంస్థలో పనిచేస్తున్న ఒక అన్నా సెబాస్టియన్ పెరియాల్ అనే నడి వయసు మహిళ ఈ మధ్య అకాల మరణం చెందారు. తాను పనిభారం, పని ఒత్తిడి కారణంగా తీవ్ర అనారోగ్యం పాలయినట్టు ఒక బహిరంగ లేఖ రాసి కన్నుమూశారు. ముంబైలో సెక్యూరిటీస్ అండ ఎక్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి)లో పని చేస్తున్న సుమారు 500 మంది ఉద్యోగులు పనిభారం విషయంలో గత వారం నిరసన ప్రదర్శనలు కూడా నిర్వహించారు. సంస్థ అధికారులు, సి.ఇ.ఓలు తమకు అలవికాని లక్ష్యాలను నిర్దేశించడం వల్ల తమ మీద మానసిక ఒత్తిడి బాగా పెరుగుతోందని, పని సంస్కృతి, పని భారం, సుదీర్ఘ పని వేళలు, సెలవులు లేకపోవడం, అవమానించడం, దుర్భాషలాడడం వంటివి తమను మానసికంగా కుంగదీస్తూ అనారోగ్యాల పాలు చేస్తున్నాయని వారు ప్రభుత్వానికి ఒక లేఖ కూడా రాయడం జరిగింది.వాస్తవానికి గత పది పదిహేనేళ్ల కాలంలో అనేక కార్పొరేట్ సంస్థల ఉద్యోగుల నుంచి ఇదే రకమైన ఫిర్యాదులు ప్రభుత్వాలకు అందుతున్నాయి. కొన్ని సంస్థలను మినహాయిస్తే దేశంలోని దాదాపు ప్రతి కార్పొరేట్ సంస్థా ఈ విష పని సంస్కృతిని పెంచి పోషిస్తున్నాయని 'ఇండియన్ వర్క్ ఫోర్స్' అధ్యయనంలో తేలింది. ఈ అధ్యయనం ప్రకారం కార్పొరేట్ సంస్థల్లో పని చేసే ప్రతి ఉద్యోగి సగటున 12 నుంచి 14 గంటల పాటు పని చేయడం జరుగుతోంది. శని, ఆదివారాల్లోనే కాక, అధికారిక సెలవు రోజుల్లో కూడా కనీసం పది గంటలపాటు పనిచేయాల్సి వస్తోంది. ఎగ్జిక్యూటివ్ స్థాయి ఉద్యోగులు 24 గంటలూ అధికారులతో టచ్ లో ఉండాల్సి వస్తోంది. అధికారులు అలవి కాని లక్ష్యాలను నిర్దేశించడంతో పాటు దుర్భాషలాడడం, అందరి ముందూ అవమానించడం అనేది సర్వసాధారణ విషయమైపోయింది. ఉద్యోగ బాధ్యతల్లో దుర్భాషలకు గురి కావడమన్నది ఒక భాగంగా మారిపోయింది. అధికారులు మధ్య మధ్య తమను అవమానించడం, చులకనగా మాట్లా డడం, ఎద్దేవా చేయడం, దుర్భాషలాడడం రోజూ కాకపోయినా వారానికి ఒకటి రెండుసార్లయినా జరుగుతూనే ఉంటుందని, ఇది తమకు అలవాటైపోయిందని ఉద్యోగుల్లో సుమారు 76 శాతం మంది అధ్యయనాల సందర్భంగా బయటపెట్టడం జరిగింది.పని వేళలు ఎక్కువగా ఉండడమనేది కూడా ఒక సహజ విషయంగా మారిపోయింది. వారానికి 70 గంటలు పని చేయాల్సిన అవసరం ఉందంటూ ఇటీవల ఇన్ఫోసిస్ కు చెందిన నారాయణ మూర్తి ప్రకటించడం కార్పొరేట్ సంస్థల అభిప్రాయానికి అద్దం పడుతోంది. అంటే, వారానికి అయిదు రోజులయ్యే పక్షంలో రోజుకు 14 గంటలు పనిచేయాల్సి ఉంటుందన్న మాట. ఆరు రోజుల పని దినాలు ఉన్నప్పటికీ పని వేళలు 12 గంటల వరకూ ఉండే అవకాశం ఉంది. సి.ఇ.ఓలు, ఎం.డిలు, ఉన్నతాధికారుల మనసులోని మాట ఇది. ఇది క్రమంగా ఒక నిబంధనగా మారిపోతోంది. గత పది పదిహేనేళ్ల కాలంలో కార్పొరేట్ సంస్థలు జీతభత్యాలను ఇబ్బడిముబ్బడిగా పెంచడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అధికారులు, యజమానులు తాము తమ ఉద్యోగులను కొనేసుకున్నట్టుగా వ్యవహరిస్తుంటారు. భారీ జీతాలను ఇస్తున్నందువల్ల ఉద్యోగులు ఎక్కువ సమయం పనిచేయ డానికి, వారాంతాల్లో కూడా విధులు నిర్వర్తించడానికి సిద్ధపడి ఉండాలని అధికారులు భావిస్తుం టారని అధ్యయనాల్లో వెల్లడైంది. ఇక మొబైల్ ద్వారా, ఇంటర్నెట్ ద్వారా, వాట్సప్ ద్వారా, ఇ-మెయిల్ ద్వారా, లాప్ టాప్ ద్వారా ఉద్యోగులు అధికారులతో టచ్ లోనే ఉండాల్సి రావడం వల్ల మానసిక ఒత్తిడి మరీ ఎక్కువగా ఉంటోంది.ఇదివరకు అవ్యవస్థీకృత రంగానికే పరిమితమైన సుదీర్ఘ పనివేళలు, భారీ లక్ష్యాలు ఇప్పుడు కార్పొరేట్ రంగానికి విస్తరించినట్టు కనిపిస్తోంది. ఇక 2023లో అంతర్జాతీయ కార్మిక సంస్థ విడుదల చేసిన వివరాల ప్రకారం, భారతదేశంలో కార్పొరేట్ ఉద్యోగులు వారానికి సగటున 47.7 గంటలు పనిచేయడం జరుగుతోంది. పది అత్యున్నత స్థాయి ఆర్థిక వ్యవస్థలను పరిగణనలోకి తీసుకున్న పక్షంలో భారతదేశం అగ్రస్థానంలో ఉందని కూడా ఆ సంస్థ పేర్కొంది. నిజానికి భారతదేశంలో పని వేళలు ఈ సంస్థ పేర్కొన్న దానికంటే ఎక్కువగానే ఉన్నాయని, పైగా దీనిలో రవాణ సమయాన్ని చేర్చలేదని ఇండియన్ వర్క్ ఫోర్స్ అనే సంస్థ తెలిపింది. అటు అవ్యవస్థీకృత రంగంలోనూ, ఇటు వ్యవస్థీకృత రంగంలోనూ పనివేళలు, పని భారం, పని ఒత్తిడి ఎక్కువగా ఉన్నందువల్లే తాజా వరల్డ్ హ్యాపీనెస్ నివేదికలో భారతదేశం 147 ర్యాంకుల్లో 126వ ర్యాంకును సంపాదించింది.

### విభజనను మించిన నష్టం

అమరావతి,మరుగునపడిన వ్యవస్థలను త్వరలోనే గాడిలో పెడతామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామనాయుడు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం 18వేల కోట్ల రూపాయల బకాయిలు ఒక్క జలవనరుల శాఖలోనే పెట్టిందని ఆరోపించారు. జగన్ ప్రభుత్వంలో ఏపీకి తీవ్ర నష్టం జరిగిందని ఆరోపణలు చేశారు. రాష్ట్ర విభజన వల్ల ఏపీకి జరిగిన నష్టం కంటే 2019-24మధ్య వైసీపీ ప్రభుత్వంలో ఏపీకి ఎక్కువ నష్టం జరిగిందని అన్నారు. కొంతమంది అధికారులు కూడా ఇంకా పాత విధానంలోనే ఉన్నారని.. అన్నింటిని సరిదిద్దుతామని స్పష్టం చేశారు. ఉన్నతాధికారులూ, వ్యవస్థలోనూ ఇంకా మార్పు రావాల్సిన అవసరం ఉందని చెప్పారు.

# 15 శాతం గ్రోత్ రేట్ లక్ష్యంగా పనిచేయాలి

అమరావతి, ప్రభుత్వంలో వివిధ శాఖల్లో నూతన పాలసీలతో అన్ని రంగాలను గాడిన పెట్టి మళ్లీ ఆర్థిక వృద్ధి సాధించాలని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. 15 శాతం గ్రోత్ రేట్ లక్ష్యంతో ప్రభుత్వం పనిచేయాలని అధికారులకు సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, పారిశ్రామిక రంగం, సేవల రంగంలో వృద్ధి పై సచివాయలంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయా శాఖల అధికారులు గత 10 ఏళ్ల కాలంలో పరిస్థితులను వివరించారు. గత పభుత్వం విధ్వంసకర విధానాలతో అన్ని రంగాలు తిరోగమనంలోకి వెళ్లాయని....దీంతో ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యిందని సీఎం అన్నారు. నేడు ప్రతిశాఖలో కొత్త పాలసీలు తీసుకువస్తున్నామని..వీటిని సమర్ధవంతంగా అమలు చేసి ఆర్థిక పురోగతి సాధించాలని సీఎం అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడంతో పాటు..ప్రజలపై అదనపు భారం లేకుండా ప్రభుత్వ ఆదాయం పెంచే విధానాలను అమలు చేయాలని సీఎం అన్నారు. వ్యవసాయం రంగంలో సమగ్ర యాంత్రీకరణ ద్వారా సాగు ఖర్చులు తగ్గించవచ్చన్నారు. ప్రభుత్వం అంటే పథకాలు ఇవ్వడం మాత్రమే కాదని...ఆయా రంగాలను బలోపేతం చేసి ప్రజల ఆదాయాలను పెంచడం ముఖ్యమని అన్నారు. 2014 తరువాత విభజన కష్టాలు ఉన్నా నాడు తీసుకున్న నిర్ణయాలతో రాష్ట్రం 13.7 శాతం గ్రోత్ రేట్ సాధించిందని...అయితే తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ రివర్స్ నిర్ణయాలతో వృద్ధి రేటు 10.59 శాతానికి తగ్గిందని సీఎం అన్నారు. 2019లో తెలంగాణతో పోల్చితే ఏపి జిఎస్డిపిలో వ్యత్యాసం కేవలం 0.20 శాతం ఉండేదని....ఆ వ్యత్యాసం 2024కు 1.5 శాతానికి పెరిగిందని సిఎం అన్నారు. 2014-15 మధ్య ఎపి ప్రజల తలసరి ఆదాయం రూ.93,903 ఉండగా....నాటి తెలుగుదేశం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో తలసరి ఆదాయం 2019 నాటికి రూ.1,54,031 పెరిగిందని సిఎం అన్నారు. తెలుగుదేశం హయాంలో తలసరి ఆదాయం వృద్ధి 13.21 శాతం ఉండగా..గత ప్రభుత్వంలో అది 9.06 శాతం మాత్రమే నమోదు అయ్యింది. ప్రజల తలసరి ఆదాయంలో వృద్ధి పడిపోయి.....ప్రజల జీవన ప్రమణాలు దెబ్బతిన్నాయన్నారు. నాడు తెలంగాణకు ఎపి మధ్య తలసరి ఆదాయంలో వ్యత్యాసం కేవలం 0.16 శాతం మాత్రమే ఉంటే...గత ప్రభుత్వంలో అది 1.84 శాతానికి పెరిగిందన్నారు. దక్షిణాది రాష్టాల్లో ఎపి తలసరి ఆదాయంలో 5వ స్థానంలో ఉందని సిఎం అన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ శాఖలు విజన్ సిద్ధం చేసుకుని నిర్ధిష్ట లక్ష్యాలతో పనిచేయాలని సిఎం అధికారులకు సూచించారు. కొన్ని శాఖలు బాగా వెనకబడి ఉన్నాయని....వారు యాక్టివ్ కావాల్సిన అవసరం ఉందని సూచించారు. త్వరలో ఈ మూడు రంగాల్లో లక్ష్యాలపై ప్రణాళికలతో రావాలని సిఎం అధికారులను ఆదేశించారు. జనవరిలో పి 4 విధానాన్ని ఆచరణలోకి తెస్తున్నామన్నారు. ఈ విధానం ద్వారా సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్నవారు ఆర్థికంగా అట్టడుగున ఉన్న 10 శాతం మందని పైకి తెసుకువచ్చేందుకు సహాయం చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే పథకాలతో పాటు....సంపన్నులు, సంస్థలు సిఎస్ఆర్ ద్వారా పేదల జీవన ప్రమాణాలు పెంచడానికి, వారికి అవకాశాలు కల్పించడానికి మెంటార్‌లా దోహద పడాలన్నారు.

# ఇజ్రాయెల్-ఇరాన్ బద్ధ శత్రువులుగా ఎలా మారాయి?

సెంట్రల్ డెస్క్:ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణులతో దాడి చేసింది. ఈ దాడుల్లో ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొసాద్ ప్రధాన కార్యాలయం ధ్వంసమైందని సమాచారం. ఇస్మాయిల్ హనియే, హిజ్బుల్లా చీఫ్ హసన్ నస్రల్లా మృతికి ప్రతీకారం తీర్చుకున్నట్లు ఇరాన్ తెలిపింది.అదే సమయంలో, ఇరాన్ ఈ దాడులు చేయడం ద్వారా పెద్ద తప్పు చేసిందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అన్నారు. ఇప్పుడు దీనికి మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఈ విషయంలో అమెరికా కూడా నెతన్యాహుకు మద్దతిస్తోంది. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య శత్రుత్వం నేడు తారాస్థాయికి చేరుకుంది. అయితే ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తత కారణంగా, ప్రపంచం మొత్తం మూడవ ప్రపంచ యుద్ధం ముప్పును ఎదుర్కొంటోందని అనడంలో తప్పేం లేదు. అదే ఇరాన్, ఇజ్రాయెల్ ఒకప్పుడు స్నేహితులు కూడా? రెండు దేశాలు పరస్పరం దాడులు చేసుకుంటున్న నేపథ్యంలో, ఈ దేశాల చరిత్రను మీరు ఖచ్చితంగా తెలుసుకోవాలి.

చాలా ఏళ్లుగా సాగుతోన్న షాడో వార్

సాధారణంగా, రెండు దేశాల మధ్య వివాదాలు వాటి సరిహద్దులు ఒకదానికొకటి ప్రక్కన ఉన్నప్పుడే మొదలవుతాయి. వాటి ప్రాంతాలతో సహా అనేక అంశాలకు సంబంధించి వాటి మధ్య విభేదాలు దేశాల మధ్య వివాదాలు నెలకొంటాయి. కానీ ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య అలాంటిదేమీ లేదు. అయితే కొన్నేళ్లుగా ఇరు దేశాలు పరస్పరం షాడో వార్‌ను సాగిస్తున్నాయి. అయితే ప్రస్తుతం రక్త దాహంతో ఉన్న ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య సంబంధాలు ఒకప్పుడు స్నేహంతో ప్రారంభమయ్యాయి.

ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య అద్భుతమైన స్నేహం

1948లో ఇజ్రాయెల్ ఉనికిలోకి వచ్చిన తర్వాత అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రపంచంలోని చాలా దేశాలు ఇజ్రాయెల్‌ను గుర్తించడానికి నిరాకరించాయి, ముఖ్యంగా మధ్యప్రాచ్యంలోని ముస్లిం దేశాలు ఇజ్రాయెల్‌ను తీవ్రంగా వ్యతిరేకించాయి. అయితే ఆ తర్వాత ఇరాన్ ఇజ్రాయెల్‌ను గుర్తించింది. ఆ సమయంలో ఇరాన్‌లో మంచి సంఖ్యలో యూదులు కూడా ఉన్నారు. గుర్తింపు పొందిన తరువాత, ఇజ్రాయెల్ ఇరాన్‌కు ఆయుధాలను సరఫరా చేయడం ప్రారంభించింది. ఇరాన్ ప్రతిఫలంగా ఇజ్రాయెల్‌కు చమురు సరఫరా చేయడం ప్రారంభించింది. సంబంధాలు ఎంతగా మెరుగయ్యాయి అంటే ఇరు దేశాల నిఘా సంస్థలు సాంకేతిక పరిజ్ఞానం నుండి సాంకేతికత వరకు ఉమ్మడిగా శిక్షణ పొందాయి.

ఇస్లామిక్ విప్లవం తర్వాత దెబ్బతిన్న సంబంధాలు

అయితే ఇరాన్‌లో అయతుల్లా ఖొమేనీ నాయకత్వంలో ఇస్లామిక్ విప్లవం ప్రారంభం కావడంతో ఇజ్రాయెల్‌తో ఇరాన్ సంబంధాలు క్షీణించడం ప్రారంభించాయి. ఖొమేనీ అమెరికా, ఇజ్రాయెల్‌లను డెవిల్ దేశాలుగా పిలవడం ప్రారంభించాడు. ఇరాన్ ప్రత్యేక ముస్లిం దేశం కోసం డిమాండ్‌ను పెంచడం ప్రారంభించింది. 1979లో, ఇరాన్ పూర్తిగా ముస్లిం దేశంగా మారింది. దీనితో ఇజ్రాయెల్‌తో ఇరాన్ మార్గాలు విడిపోయాయి.

ఇలా శత్రు రేఖ గీశారు..

ఇస్లామిక్ విప్లవం తరువాత, రెండు దేశాల రాకపోకలు ఆగిపోయాయి. విమాన మార్గం పూర్తిగా మూసివేయబడింది. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు కూడా నిలిచిపోయాయి. టెహ్రాన్‌లోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయాన్ని పాలస్తీనా రాయబార కార్యాలయంగా మార్చారు. పైగా, రెండు దేశాలు ఇప్పుడు ఒకరినొకరు గుర్తించుకోవడం మానేశాయి. ఇరాన్ మొదట్లో ఇజ్రాయెల్‌ను గుర్తించింది, కానీ తరువాత ఇజ్రాయెల్ పాలస్తీనియన్ల హక్కులను ఉల్లంఘించిందని చెప్పడం ప్రారంభించింది. ఆ క్రమంలో ఏకపక్ష



ప్రేమ ఎంత వరకు ఉంటుంది? కాబట్టి ఇజ్రాయెల్ కూడా ఇస్లామిక్ రిపబ్లిక్ అంగీకరించడానికి నిరాకరించింది.

రాన్ ఇజ్రాయెల్ శత్రువులతో చేతులు కలిపింది..

తరువాత, ఇరాన్ సిరియా, యెమెన్, లెబనాన్ వంటి ఇజ్రాయెల్ ప్రత్యర్థులకు ఆయుధాలను సరఫరా చేయడం ప్రారంభించినప్పుడు సంబంధాలు మరింత క్షీణించాయి. ఎనభైలలో పాలస్తీనా పేరుతో ఇరాన్‌తో ఘర్షణ పడుతున్న ఇస్లామిక్ జిహాద్ అనే ఉగ్రవాద సంస్థకు ఇరాన్ బహిరంగంగా మద్దతు ఇచ్చింది. ఆపై ఉద్రిక్తత,శత్రుత్వం కథ ముందుకు సాగింది.

ఇరాన్ దాడులపై అమెరికా వైఖరి ఏమిటి?

ఇరాన్ క్షిపణి దాడులకు సంబంధించి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మాట్లాడుతూ.. ఇజ్రాయెల్‌కు అమెరికా పూర్తిగా మద్దతిస్తోంది. బైడెన్ తన సూచనల మేరకు, ఈ దాడి సమయంలో ఇజ్రాయెల్‌ను రక్షించడంలో యుఎస్ మిలిటరీ చురుకుగా సహాయం చేసింది. ఈ దాడి విఫలమైందని ఆయన అన్నారు. అదే సమయంలో, ఇరాన్ క్షిపణులను కూల్చివేయడంలో ఇజ్రాయెల్‌కు అమెరికా సహాయం చేసిన విధానం ఖచ్చితంగా సరైనదని యూఎస్ వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్ అన్నారు.

క్యాంప్ డేవిడ్ లాగా అమెరికా ఒప్పందం చేయలేకపోతుందా?

1978 సెప్టెంబర్ 17న ఇజ్రాయెల్, ఈజిప్ట్ మధ్య క్యాంప్ డేవిడ్ ఒప్పందం కుదిరింది. ఇందులో అమెరికా అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ మధ్యవర్తిత్వం వహించారు. క్యాంప్ డేవిడ్ ఒప్పందాలపై అప్పటి ఈజిప్టు అధ్యక్షుడు అన్వర్ సాదత్, ఇజ్రాయెల్ ప్రధాని మెనాచెమ్ బిగిన్ సంతకం చేశారు. ఈ ఒప్పందంతో ఇరు దేశాల మధ్య శాంతి నెలకొంది. ఈ ఒప్పందాల కారణంగా, సాదత్, బిగిన్ సంయుక్తంగా 1978లో నోబెల్ శాంతి బహుమతిని అందుకున్నారు. అయితే, ప్రస్తుతం ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఇటువంటి ఒప్పందం సాధ్యం కావడం కష్టంగా కనిపిస్తోంది. ఎందుకంటే రెండు దేశాల మధ్య సమస్యలు సంక్లిష్టంగా ఉన్నాయి. ఇరాన్ అణు కార్యక్రమం గురించి ప్రపంచ సమాజంలో ఆందోళన ఉంది.

ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య శత్రుత్వానికి ఎప్పటికైనా ముగింపు ఉంటుందా?

పాశ్చాత్య దేశాలతో ఇజ్రాయెల్ సంబంధాలు మెరుగుపరచుకోవడం ఇరాన్‌కు తన శత్రుత్వాన్ని పునరాలోచించేలా చేస్తుంది. అయితే, ఇది జరగాలంటే, ఇరాన్‌లో మరింత మితవాద నాయకత్వం మళ్లీ ఆవిర్భవించే పరిస్థితులు తలెత్తాలి. ప్రస్తుత సుప్రీం నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ మరణం తర్వాత అలాంటి పరిస్థితి తలెత్తవచ్చు. పాలస్తీనా సమస్యపై పురోగతి ఇరాన్ తన వైఖరిని పునఃపరిశీలించేలా కూడా ప్రభావితం చేయవచ్చు. ఇందుకోసం ఇరాన్, సౌదీ అరేబియా మధ్య సంబంధాల పునరుద్ధరణలో సహాయం చేస్తున్న చైనా.. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కొన్ని నిశ్శబ్ద ఒప్పందాలు కూడా చేయ్యొచ్చు. అయితే, ఇప్పుడే ఏదైనా చెప్పడం చాలా కష్టమే.

# ట్రిపుల్ ఆర్ నిర్వాసితులకు భూమి ఇవ్వాలి

హైదరాబాద్, ఓఆర్ఆర్ నుంచి రీజనల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) వరకు ప్రధానమైన నాలుగు రహదారులు విస్తరణ విషయంలో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు వెంటనే నష్టపరిహారం లేదా భూమి కేటాయించాలని మల్కాజ్‌గిరి బిజెపి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భూ నిర్వాసితులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని హెచ్చరించారు. పేద రైతుల స్థలాలను గుంజుకుని రైతులను బిచ్చగాళ్లను చేస్తానంటే ఎవరు ఊరుకోరని ఆయన హెచ్చరించారు. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదని అన్నారు. హైదరాబాద్ ధర్నాచౌక్‌లో ట్రిపుల్ ఆర్ రోడ్డు విస్తరణ సందర్భంగా భూనిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థలాలు కోల్పోయిన రైతులకు ప్రత్యామ్నాయంగా స్థలాలు, ఆర్థిక సహకారాన్ని అందించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ట్రిపుల్ ఆర్ చుట్టుపక్కల ఉన్న రైతులం తా పెద్ద సంఖ్యలో ఈ ధర్నాలో పాల్గొన్నారు. ఈ ధర్నాలో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్,బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలా శేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, మాజీ ఎంపీ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, ఐక్యవేదిక నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణ సందర్భంగా భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం, స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా రైతులను పట్టించుకోకుండా బిచ్చగాళ్లను చేస్తామంటేఎవరూ ఊరుకోరని ఈటల రాజేందర్ హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వస్తే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లి రీజనల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులకు తన వంతు న్యాయం చేస్తానని ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు.

## ఫోర్త్ సిటీ ఓ కల్పిత నగరం మాత్రమే

హైదరాబాద్,సీఎం రేవంత్.. రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా పని చేస్తున్నారు అంటూ బిఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై గౌడ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. 69 కిలోమీటర్ల మేర మెట్రోను పూర్తి చేసి ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. మెట్రో రైలును రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వరకు తీసుకువెళ్లాలని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారన్నారు.రెండవ దశ మెట్రో పనులకు రూ.24 వేల కోట్లు బ్జడెట్ పెడితే.. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రూ.11 కోట్లు బడ్జెట్‌లో పెట్టిందన్నారు. ఫోర్త్ సిటీ ఒక కల్పిత నగరం అని.. ఫోర్త్ సిటీ అంటే పేపర్ పైన లేని నగరం అంటూ వ్యాఖ్యలు చేశారు. ఫోర్త్ సిటీకి మెట్రో తీసుకువెళ్తామని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని.. ఊహల నగరం కోసం హైదరాబాద్ నగరాన్ని సీఎం రేవంత్ రెడ్డి విస్మరిస్తున్నారని మండిపడ్డారు. రియల్ ఎస్టేట్ దందా కోసమే ఫోర్త్ సిటీ అని సీఎం అంటున్నారన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి మెట్రో అవసరం ఉందని గతంలో ఎంపీగా రేవంత్ రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. అయితే కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలను రేవంత్ మోసం చేశారన్నారు. రియల్ ఎస్టేట్ కోసమే మూసీ బ్యూటిఫికేషన్ అని సీఎం అంటున్నారని.. రేవంత్ రెడ్డి నిర్ణయాలతో ప్రజల భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరుతో హైదరాబాద్ నగరంలో ఎవరూ సంతోషంగా లేరన్నారు.

# మరోమారు ఘాటు విమర్శలు చేసిన మంత్రి

సిద్దిపేట,భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. గజ్వేల్ పర్యటన సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. సోషల్ మీడియాను అడ్డం పెట్టుకొని తమపై పిచ్చి రాతలు రాయిస్తున్నారని మండిపడ్డారు. తొమ్మిది హామీలను అమలు చేస్తే పదో హామీ ఎందుకు ఇవ్వలేదని కేటీఆర్ ప్రశ్నిస్తున్నారు. పదవీ కాంక్షతో కేసీఆర్‌ని కేటీఆర్ ఏదో చేశారన్న ప్రచారం జరుగుతోంది. కేటీఆర్ సీఎం అనుకుని పిచ్చి నిర్ణయాలు తీసుకున్నారు. భారాస ఓడిపోవడానికి ప్రధాన కారణం ఆయనే. బడ్జెట్ రోజు అసెంబ్లీకి వచ్చిన కేసీఆర్ మళ్లీ కనిపించలేదు. ఫామ్‌హౌస్‌లో ఏం చేస్తున్నారో తెలియదు. గజ్వేల్‌లో కేసీఆర్ కనిపించడంలేదని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాం. పార్లమెంట్ ఎన్నికల్లో సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాల్లో భాజపా, భారాస మధ్య చీకటి ఒప్పందం జరిగింది. కవిత బెయిల్ కోసం ప్రధానితో మాట్లాడి ఒప్పందం చేసుకుని.. భారాస నుంచి భాజపాకు క్రాస్ ఓటింగ్ జరిగిందని కొండా సురేఖ ఆరోపించారు. కేటీఆర్‌కి పదవి కాంక్ష ఎక్కువ.. కేసీఆర్‌ను ఫామ్ హౌజ్ లోపల కేటీఆర్ గొంతు పిసికిండో ఏమోనన్న అనుమానం వస్తుందని తీన్మార్ మల్లన్న అంటున్నారు. మరీ తీన్మార్ మల్లన్న అనుమానం వ్యక్తం చేసినట్లు ఫామ్‌హౌస్‌లో ఏం జరిగిందో ఏమో కానీ.. గత కొన్ని రోజులుగా కేసీఆర్ మాత్రం కనిపించడం లేదని మంత్రి సురేఖ హాట్ కామెంట్స్ చేశారు. గజ్వేల్ నియోజకవర్గం నుండి గెలిచిన వ్యక్తి సభలకు ఇవ్వమంటే ఎక్కడున్నాడో తెలియదు.. మిమ్మల్ని గెలిపించిన గజ్వేల్ ప్రజలకు కష్టం వస్తే ఎవరికి చెప్పుకోవాలని కేసీఆర్‌ని నిలదీశారు. మా ఎమ్మెల్యే కనబడటం లేదని పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టమని కోరుతున్నానని గజ్వేల్ ప్రజలకు సూచించారు. మెదక్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో కాంగ్రెస్ పార్టీ ఎందుకు గెలువలేకపోయిందనే భావన నాలో ఉందన్నారు. బీజేపీకి బీఆర్ఎస్ అమ్ముడు పోవడం వల్లనే కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు మెదక్‌లో ఓటమి పాలయ్యారని ఆరోపించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కవిత జైల్ నుండి బయటికి రావడం కోసం చీకటి ఒప్పందం చేసుకున్నారని విమర్శించారు. మెదక్‌లో మేము గెలవకున్న సరే బీజేపీని గెలిపించాలనే విధంగా బీఆర్ఎస్ పని చేసిందని మండిపడ్డారు. ప్రజలకు సేవ చేయడానికి మేము ముందుకు పోతుంటే.. పనికి మాలిన సోషల్ మీడియాతో కాంగ్రెస్ పార్టీపై కేటీఆర్ తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమి పాలుకావడానికి ప్రధాన కారణం కేటీఆర్ అని మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. అధికారం కోల్పోయే సరికి కేటీఆర్‌కి మతిభ్రమించి తిరుగుతున్నాడని ఫైర్ అయ్యారు. హైడ్రా, మూసీ అంటూ కేటీఆర్ ప్రజల్లో ప్రలోభాలకు తెరలేపు తున్నాడని.. అస్సలు మూసీ ప్రక్షాళనకు తెరలేపింది బీఆర్ఎస్ పార్టీనేనని గుర్తు చేశారు. ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకిస్తూ ప్రజల్లో ప్రలోభాలకు తెరలేపితే ఉపేక్షించబోమని.. ఇకనైనా ఒళ్ళు దగ్గర పెట్టుకుని ఉండాలని ఈ వేదిక ద్వారా హెచ్చరిస్తున్నానని సురేఖ వార్నింగ్ ఇచ్చారు.

# తిరుపతి లడ్డూలో కల్తీ వ్యవహారం

న్యూఢిల్లీ, తిరుపతి శ్రీవారి లడ్డూ ప్రసాదంలో నెయ్యికల్తీ అంశంపై విచారణను సుప్రీంకోర్టు శుక్రవారం ఉదయం పదిన్నరకు వాయిదా వేసింది. కేంద్ర దర్యాప్తు సంస్థల విచారణపై కేంద్రం అభిప్రాయం చెప్పేందుకు రేపటి వరకూ సమయం కావాలని సొలిసిటర్ జనరల్ కోరడంతో విచారణ ప్రారంభమైన వెంటనే ధర్మాసనం శుక్రవారం ఉదయం పదిన్నకు కేసును వాయిదా వేస్తూ నిర్ణయం ప్రకటించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రెస్ మీట్ పెట్టి లడ్డూ కల్తీ అంశం గురించి ప్రకటించి నందున సిట్ విచారణపై సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యక్తం చేసింది. అందుకే కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ చేయించే అంశంపై కేంద్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని కోరింది. అయితే కేంద్రం ఇంకా ఎలాంటి నిర్ణయం చెప్పకపోవడంతో సొలిసిటర్ జనరల్ తుషార్ మొహతా వాయిదా కోరారు. శుక్రవారం ఉదయం పదిన్నర గంటలకు జరిగే విచారణలో కేంద్రం చెప్పే అభిప్రాయాన్ని బట్టి సుప్రీంకోర్టు లడ్డూ కల్తీ అంశాన్ని ఏ దర్యాప్తు సంస్థ విచారణ చేయాలన్నది ఖరారు చేస్తారు. ఆ తర్వాత ఆయా సంస్థలు విచారణ ప్రారంభించే అవకాశం ఉంది. ఇప్పటికే ఏపీ ప్రభుత్వం సీనియర్ ఐపీఎస్ అధికారి సర్వశ్రేష్ఠ త్రిపాఠి నేతృత్వంలో ఓ సిట్ ను నియమించింది. వారునాలుగు రోజుల పాటు తిరుమలతో పాటు ఏఆర్ డెయిరీలో కూడా పరిశీలించారు. అనేక వివరాలు తెలుసుకున్నారు. ప్రాథమిక నివేదది సిద్ధం చేసే టప్పటికీ సుప్రీంకోర్టు వ్యతిరేక వ్యాఖ్యలు చేయడంతో దర్యాప్తు నిలిపివేయాలని డీజీపీ నిర్ణయించుకున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారమే తదుపరి విచారణ ఉంటుందని తెలిపారు. ఒక వేళ సిట్ కు అనుమతి ఇస్తే.. విచారణ కొనసాగించే అవకాశం ఉంది. సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలకు అనుమతి ఇస్తే.. ఆయా సంస్థలు కేసును టేకప్ చేసుకునే అవకాశాలు ఉన్నాయి. అయితే పిటిషనర్లు మాత్రం.. ఎవరు దర్యాప్తు చేసినా సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పర్యవేక్షణ ఉండాలని కోరుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్తలపై నమ్మకం లేదంటున్నారు. అయితే ఇలాంటి కేసులను సుప్రీంకోర్టు తమ పర్యవేక్షణలో దర్యాప్తు చేయిస్తుందా లేదా అన్నదానిపై న్యాయనిపుణుల్లో సందేహాలు ఉన్నాయి. ఆరోపణలు ఎదుర్కొంటున్న వైవీ సుబ్బారెడ్డి కూడా పిటిషన్ దార్లలో ఉండటంతో.. ఆయన కోసం దర్యాప్తు సంస్థల విశ్వసనీయతను ప్రశ్నించబోరని న్యాయనిపుణులు చెబుతున్నారు. ఏమైనా శుక్రవారం ఉదయం జరిగే విచారణలో కేంద్ర ప్రభుత్వం వెల్లడించే అభిప్రాయాన్ని బట్టి ఏ సంస్థ దర్యాప్తు చేయాలన్నది ఖరారు చేసే అవకాశం ఉంది.

## ఏపీలో సీడ్ పథకం అమలు : మంత్రి సవిత

విజయవాడ,కేంద్రప్రభుత్వం సహకారంతో ఏపీలో సీడ్ పథకం అమలు చేస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖామంత్రి ఎస్ సవిత తెలిపారు. విజయవాడలో బీసీ సంక్షేమ శాఖలో కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలుపై నిర్వహించిన వర్క్ షాప్‌లో మంత్రి ఎస్ సవిత పాల్గొన్నారు. ఏపీలో ఇప్పటికే 6 జిల్లాలో సీడ్ పథకం అమలు... త్వరలో మిగిలిన 20 జిల్లాల్లో అమలు చేస్తున్నామని వివరించారు. సీడ్ పథకం కింద బీసీ-ఏలో ఉన్న సంచార జాతుల జీవన ప్రమాణాలు పెంచేలా నిర్ణయం తీసుకుంటున్నామని మంత్రి ఎస్ సవిత అన్నారు. 00 బీసీ హాస్టళ్లలో ఎస్ఆర్ శంకరన్ రిసోర్స్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. బీసీ హాస్టళ్లను తరుచూ సందర్శించాలని జిల్లా అధికారులను మంత్రి సవిత ఆదేశించారు. బీసీ హాస్టళ్లు , గురుకుల పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. బీసీ కులాల వృత్తుల్లో నైపుణ్యం పెంచి జీవనోపాధి పెంపొందించేలా ఆర్థిక చేయూత అందిస్తామని మంత్రి సవిత తెలిపారు. బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా అన్ని కాంపిటీటివ్ పరీక్షలకు శిక్షణ ఇస్తామని మంత్రి చెప్పారు. ఈ వర్క్ షాప్‌లో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి పోలా భాస్కర్, డైరెక్టర్ మల్లికార్జున, ఎన్ఎం ఎంఎస్ఎంఈ డైరెక్టర్ జనరల్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు జిల్లాలో శరన్నవరాత్రివేడుకలు



మహబూబ్‌నగర్,ఉమ్మడి పాలమూరు జిల్లాలో శరన్నవరాత్రివేడుకలు ప్రారంభం అయ్యాయి. ఆలయాల్లో శైవ సంప్రదాయంలో దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు, వైష్ణవ సంప్రదాయంలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఇదే మాసంలో నిర్వహిస్తారు. కొత్తగా పెళ్లయిన ఆడబిడ్డలు పుట్టింటికి చేరుకుంటారు. ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ పండగ నిర్వహిస్తారు. రకరకాల పిండివంటలు చేసుకుంటారు. ఊరూరా నెలకొల్పే దుర్గామాత విగ్రహాల వద్ద కోలాటాలు, బతుకమ్మ ఆటలతో సాంస్కృతిక శోభ ఉట్టిపడనుంది. పాండవులు జమ్మిచెట్టు మీద దాచిన ఆయుధాలను తీసుకుని యుద్ధం చేసి శత్రువులను ఓడించిన వృత్తాంతాన్ని గుర్తుచేసుకుంటూ దసరా రోజు సాయంత్రం వేళ ప్రజలు జమ్మిచెట్టుకు పూజలు చేస్తారు. అనంతరం శమిపత్రాలను తల్లిదండ్రులు, పెద్దలకు సమర్పించి వారి ఆశీర్వాదం తీసుకుంటారు. పలు చోట్ల రావణ దహనం కార్యక్రమం చేపడతారు.ఐదో శక్తిపీఠం అలంపూర్ జోగులాంబ అమ్మవారి దేవాలయం విద్యుత్తు దీపాల అలంకరణలో మిరుమిట్లు గొలుపుతోంది. రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ శ్రీజోగులాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. భారీగా తరలివచ్చే భక్తుల కోసం ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాలను విద్యుద్దీపాలతో అలంకరించటంతో ప్రత్యేక శోభ సంతరించుకుంది. నవరాత్రుల్లో అమ్మవారు శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంటాదేవి, కూష్మాండదేవి, స్కందమాత, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిదాత్రిగా ప్రత్యేక దర్శనమిస్తారు. రోజూ త్రిశతి, ఖడ్గమాల అర్చనలు నిర్వహిస్తారు. ప్రత్యేకంగా కుమారి, సువాసిని పూజ నిర్వహిస్తారు. సహస్ర నామార్చన, నవవర్ణ అర్చన, తర్వాత చండీహోమం ఉంటాయి. 9న ఉదయం 10 గంటలకు మూలానక్షత్ర శుభ సమయమున జోగులాంబ అమ్మవారు, బాల బ్రహ్మేశ్వరస్వామి వారి కల్యాణం, సాయంత్రం 4 గంటలకు సింహవాహన సేవ, 10న దుర్గాష్టమి సందర్భంగా ఉదయం 10 గంటలకు రథోత్సవం, 11న మహర్నవమి పురస్కరించుకుని కాళరాత్రి పూజ నిర్వహిస్తారు. 12న విజయదశమి రోజు ఉదయం 8 గంటలకు మహాపూర్ణాహుతి, సాయంత్రం 4 గంటలకు శమీపూజ, 6.30 గంటలకు నదీహారతులు, జోగులాంబ అమ్మవారు, శ్రీబాలబ్రహ్మేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను హంసవాహనంలో ఆసీనులను చేసి తుంగభద్ర నదిలో తెప్పోత్సవాన్ని కనుల పండువగా నిర్వహిస్తారు. గద్వాల సమీప జమ్మిచేడులో వెలసిన జములమ్మ ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రతివారం మంగళ, శుక్రవారాల్లో 10వేల వరకు భక్తులు దర్శించుకుంటారు. కలశస్థాపనతో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభిస్తారు. రోజూ ఉదయం 8 గంటలకు విశేష ఫలపంచామృతాభిషేకం, అలంకరణ పూజలుంటాయి. తొమ్మిది రోజుల్లో మహాలక్ష్మీదేవి, గజలక్ష్మి, అన్నపూర్ణదేవి, శాకాంబరిదేవి, పార్వతి, ధనలక్ష్మి సరస్వతీమాత, దుర్గాదేవి, మహిషాసురమర్ధినిగా దర్శనమిస్తారు. చివరిరోజు జములమ్మ నిజరూపంలో దర్శనమిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు కోనేరులో తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు. ఈ వేడుకలో సుమారు 15 వేలమంది వరకు భక్తులు పాల్గొంటారని ఆలయం ఈవో పురేందర్ తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు. దేవాలయాన్ని సుందరంగా అలంకరించారు. రోజూ తెల్లవారుజామున 4 గంటల నుంచి మూలవిరాట్టుకు అభిషేకాలతో పూజలు ప్రారంభిస్తారు. అలంకరణ, కుంకుమార్చన మహానివేదన తర్వాత భక్తుల దర్శనాలు ప్రారంభమవుతాయి. అమ్మవారిని 3న బాలత్రిపుర సుందరి, 4న లక్ష్మీదేవి, 5న గాయత్రీదేవి, 6న వనదుర్గాదేవి, 7న అన్నపూర్ణాదేవి, 8న శాకాంబరిదేవి, 9న సరస్వతీ దేవిగా అలంకరిస్తారు. 10న కాళికాదేవిగా నిమ్మకాయలు, గుమ్మడికాయలతో అలంకరణ చేసి కుంభం పోస్తారు. 11న దుర్గాదేవి 12న రేణుకాఎల్లమ్మగా అలంకరించి ఆలయ వద్ద ఉన్న జమ్మిచెట్టుకు పూజ చేస్తారు. స్థానిక అంబాభవానీ, కాళికాదేవి, మహబూబ్‌నగర్, జడ్చర్లలోని వాసవీమాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. నవాబుపేట మండలం కాకర్లపాడు పరిధి అటవీ ప్రాంతంలో వెలసిన ఫతేపూర్ మైసమ్మ దేవత భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్నారు. ప్రతి ఆది, మంగళవారాల్లో వేలాది భక్తులు దర్శించుకుంటారు. శరన్నవరాత్రుల్లో కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వస్తారని ఆలయ అధికారి మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు. నవరాత్రులను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మొదటిరోజు గణపతిపూజ, అఖండ దీపారాధన, ధ్వజారోహణం, చక్రపూజ కైంకర్యాలతో అమ్మవారిని పూజిస్తారు. నవరాత్రుల్లో మూలవిరాట్టుకు రోజుకో అలంకరణ చేసి ఆరాధించనున్నట్లు ప్రధాన అర్చకుడు శ్రీకాంత్‌శర్మ తెలిపారు. మన్యంకొండ శ్రీవేంకటేశ్వరస్వామి, చిన్నచింతకుంట మండలంలోని కురుమూర్తిస్వామి, బీచుపల్లి ఆంజనేయస్వామి, మద్దిమడుగులోని ఆంజనేయస్వామి, పాలెం, కోస్గిలోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో వైష్ణవ సంప్రదాయం ప్రకారం వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తారు.

# మంత్రి సురేఖపై ముప్పేట దాడి.. కాంగ్రెస్‌కు మరో తలనొప్పి

హైదరాబాద్,తెలంగాణ కాంగ్రెస్ పార్టీని వివాదాలు చుట్టుముడుతున్నాయి. అధికారంలోకి వచ్చినప్పటికీ నేతల మధ్య అంతర్గత విబేధాల కారణంగా పార్టీ శ్రేణులు ఇబ్బందులు పడుతున్నాయి. మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల్లో పార్టీకి మంచి పేరు తీసుకొస్తున్నాయి అనుకునేలోగా హైడ్రా విషయంలో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. భాగ్యనగరంలో చెరువులు, నాలాలను ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేస్తోంది. ప్రారంభంలో సినీ నటుడు అక్కినేని నాగార్జున ఎన్ కన్వెన్షన్ కూల్చివేత సమయంలోనూ , మరికొందరి బడాబాబుల అక్రమ నిర్మాణాలు కూల్చివేత సమయంలో హైడ్రాపై ప్రజల నుంచి ప్రశంసల జల్లు కురిసింది. రేవంత్ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని సర్వత్రా పొగడ్తలు వినవచ్చాయి. కానీ రోజుల వ్యవధిలో పరిస్థితి మారిపోయింది. మూసీ పరివాహక ప్రాంతాల్లోని పేదల ఇండ్లకూల్చివేత హైడ్రాపైనే కాకుండా రేవంత్ సర్కార్ పై కూడా తీవ్ర వ్యతిరేకతకు కారణమైంది. రాష్ట్ర వ్యాప్తంగా మెజార్టీ ప్రజలు హైడ్రా తీరును తప్పుబడుతున్నారు. దీంతో విపక్షాలు బీఆర్ఎస్, బీజేపీలు హైడ్రాను అడ్డుపెట్టుకొని రేవంత్ సర్కార్ ను, కాంగ్రెస్ ను ఇరుకుపెట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. హైడ్రా విషయంపై రెండు రోజులుగా అధికార, విపక్ష పార్టీల నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి మరో సమస్య ఎదురైంది. మంత్రి కొండా సురేఖ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ పై చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాలతోపాటు సినీ రంగాన్ని ఓ కుదుపు కుదిపేశాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలోని దుబ్బాకలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న కొండా సురేఖకు మెదక్ ఎంపీ రఘునందనరావు చేనేత కార్మికుల సమస్యలను విన్నవిస్తూ నూలుపోగు దండను మంత్రి మెడలో వేశారు. దీనిపై కొందరు ట్రోల్స్ చేయడంతోపాటు అసభ్యకరంగా పోస్టులు చేశారు. సోషల్ మీడియాలో ఈ పోస్టులు చేసిన వ్యక్తుల డీపీలో బీఆర్ఎస్ నేత హరీష్‌రావు ఫోటో ఉండటంతో వాళ్లు బీఆర్ఎస్ కార్యకర్తలుగా కాంగ్రెస్ అనుమానిస్తోంది. బీఆర్ఎస్ నేతల ఆదేశాలతోనే ఈ పోస్టులు చేశారని, దీని వెనుక కేటీఆర్, హరీష్‌రావు ఉన్నారంటూ కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ఈ ట్రోలింగ్స్‌పై హరీష్‌రావు స్పందిస్తూ.. కొండా సురేఖను ఉద్దేశించి చేసిన పోస్టులు సమర్థనీయం కాదన్నారు. అయితే, కేటీఆర్ వీటిపై స్పందించకపోవడంతో ఆయనను కాంగ్రెస్ టార్గెట్ చేసింది. ఈ క్రమంలో కొండా సురేఖ మాట్లాడుతూ.. కేటీఆర్ లక్ష్యంగా సంచలన ఆరోపణలు చేశారు. కొందరు హీరోయిన్లకు కేటీఆర్ డ్రగ్స్ అలవాటు చేశారని ఆరోపించారు. హీరోయిన్లకు డ్రగ్స్ అలవాటుచేయడంతో పాటు.. కేటీఆర్ వారిని వేధించారనీ ఆరోపించారు. కొందరు హీరోయిన్లు కెరీర్ ను వదులుకుని వివాహం చేసుకోవడానికి కారణం కూడా కేటీఆర్ వేధింపులే కారణం అన్నట్లుగా విమర్శలు గుప్పించారు. దీనిపై ఎవరైనా హీరోయిన్లు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారా అనే ప్రశ్నకు మంత్రి కొండా సురేఖ స్పందిస్తూ.. వాళ్లెవరూ బయటకురారని, ప్రభుత్వం మాత్రం ఈ ఘటనపై విచారణ చేస్తుందన్నారు. ఇదే సమయంలో సమంత, నాగచైతన్య విడాకులపై కూడా కొండా సురేఖ ఆరోపణలు చేశారు. వీరిద్దరూ విడిపోవడానికి ప్రధాన కారణం కేటీఆర్ అన్నారు. ఈ విషయం అందిరికీ తెలుసు. ముఖ్యంగా సినీ పరిశ్రమలో చాలామందికి తెలుసంటూ సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. సురేఖ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు, టాలీవుడ్ సినీ ప్రముఖులు మండిపడుతున్నారు.మంత్రి సురేఖ వ్యాఖ్యలపై హీరో నాగార్జున, ఆయన సతీమణి అమలతోపాటు సమంత కూడా స్పందించారు. వీరితోపాటు మరికొందరు టాలీవు సినీ ప్రముఖులు మంత్రి వ్యాఖ్యలను తప్పుబట్టారు. నాగార్జున ట్విటర్ వేదికగా స్పందిస్తూ.. కొండా సురేఖ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని ప్రకటించారు. రాజకీయాలకు దూరంగా



ఉండే సినీ ప్రముఖుల జీవితాలను, మీ ప్రత్యర్థుల్ని విమర్శించేందుకు వాడుకోకండి. దయచేసి సాటి మనుషుల వ్యక్తిగత విషయాలను గౌరవించండి. బాధ్యత కలిగిన పదవిలో ఉన్న మహిళగా మీరు చేసిన వ్యాఖ్యలు, మా కుటుంబం పట్ల మీరు చేసిన ఆరోపణలు పూర్తిగా అసంబద్ధం, అబద్ధం. తక్షణమే మీ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాల్సిందిగా కోరుతున్నాను అని నాగార్జున పేర్కొన్నారు. నాగార్జున భార్య అమల కూడా ట్విటర్ వేదికగా స్పందించారు. రాజకీయ స్వలాభం కోసం ఇంత భయంకరమైన ఆరోపణలు చేయడం, మామూలు ప్రజలను వేటగా మార్చుకోవడం కూడా షాకింగ్‌గా అనిపిస్తోంది. రాహుల్ గాంధీ గారు.. మీరు నిజంగా మానవత్వాన్ని నమ్మితే మీ నాయకులను ఆపండి. అలాగే మీ మినిస్టర్ చేసిన ఘోరమైన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని మా కుటుంబానికి క్షమాపణలు చెప్పేలా చేయండి. ఈ దేశ ప్రజలను కాపాడండి.. అంటూ రాహుల్ గాంధీకి కూడా అమల ఓపెన్‌గా రిక్వెస్ట్ పెట్టారు.మంత్రి సురేఖ వ్యాఖ్యలపై సమంత కూడా స్పందించారు. ఒక అమ్మాయిగా పుట్టడం, బయటికి వచ్చి పనిచేయాలని అనుకోవడం, అమ్మాయిలను ఆటబొమ్మల్లాగా కాకుండా మనుషులుగా ఎక్కువగా ట్రీట్ చేయని గ్లామర్ ప్రపంచంలో అడుగుపెట్టి ముందుకు సాగడం, ప్రేమలో పడడం, ప్రేమ నుండి బయటపడడం, అయినా నిలబడి పోరాడడం.. ఇవన్నీ అంత సులభం కాదు. దీనికోసం చాలా శక్తి, ధైర్యం కావాలి. ఈ ప్రయాణం నన్ను ఎలా మలిచింది అనే విషయంపై నేను గర్వపడుతూనే ఉంటాను మంత్రి గారు.. దయజేసి దానిని చిన్నచూపు చూడకండి. మినిస్టర్‌గా మీరు మాట్లాడే మాటలు జనాల్లోకి ఎలా వెళ్తాయో ఒక్కసారి ఆలోచించండి అంటూ కొండా సురేఖ పేరును ప్రస్తావిస్తూ సమంత లేఖ విడుదల చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ కొండా సురేఖ వ్యాఖ్యలను సీరియస్ గా తీసుకున్నారు. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని లీగల్ నోటీసు పంపారు. అబద్దాలు, అసత్యాలతో దురుద్దేశపూర్వకంగా మాట్లాడినందుకు బహిరంగ క్షమాపణ చెప్పాలని కేటీఆర్ పేర్కొన్నారు. సురేఖ వ్యాఖ్యలపై పలువురు టాలీవుడ్ సినీ ప్రముఖులు స్పందిస్తున్నారు. మంత్రి హోదాలో ఉండి ఆమె ఇలా మాట్లాడటం సరికాదని పేర్కొంటున్నారు. మొత్తానికి మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాలనేకాక.. టాలీవుడ్ నూ కుదిపేస్తున్నాయి. ఇప్పటికే హైడ్రా కాంగ్రెస్ ప్రభుత్వానికి తలనొప్పి తెచ్చిపెట్టగా.. ప్రస్తుతం కొండా సురేఖ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీకి కొత్త తలనొప్పి తెచ్చిపెట్టాయి. ఇలాంటి పరిస్థితుల్లో కొండా సురేఖ క్షమాపణలు చెబుతారా? ఎదురుదాడికి దిగి వివాదం మరింత తీవ్రరూపం దాల్చడానికి కారణం అవుతారా అనే విషయంపై రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో కొండా సురేఖ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు. అయితే అది ఈ వివాదం సర్దుమణగడానికి సరిపోతుందని పరిశీలకులు భావించడం లేదు.

# కొండా సురేఖను బర్తరఫ్ చేయాలి

హైదరాబాద్,అక్కినేని నాగచైతన్య, సమంత విడిపోవడానికి మాజీ మంత్రి కేటీఆరే కారణమంటూ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనాన్ని సృష్టిస్తోంది. ఈ వ్యాఖ్యలను ప్రతీఒక్కరూ ఖండిస్తున్నారు. సినీ ప్రముఖులు మంత్రి వ్యాఖ్యలను తప్పుబడుతున్నారు. తాజాగా మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ స్పందించారు. కొండా సురేఖను రాహుల్ గాంధీ మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కొండా సురేఖ వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డి ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. కొండా సురేఖ మాటలు రాజకీయాలు అంటే అసహ్యం వేస్తోందన్నారు. కొండా సురేఖ రాజకీయం కోసం సినిమా పరిశ్రమ వాళ్ళను అవమానించారన్నారు. సినిమా పరిశ్రమలో ఉన్న వాళ్ళను తప్పుడు వ్యక్తులుగా మంత్రి చిత్రీకరించారన్నారు. మంత్రి పొంగులేటి కుమారుడి చేతి వాచ్ వ్యవహారంలో ఈడీ రైడ్స్ జరిగాయని బీఆర్ఎస్ నేత అన్నారు. పొంగులేటి ఇంట్లో 1600 కోట్లు దొరికినట్లు ప్రచారం జరిగిందని.. బంగారం పెద్ద మొత్తంలో దొరికినట్లు తెలిస్తుందన్నారు. పొంగులేటి నివాసంలో ఏం దొరికిందో ఈడీ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. లెక్కకు మించిన ఆదాయం దొరికితే ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. రైడ్స్ తర్వాత గౌతమ్ ఆదానీ, పొంగులేటి, సునీల్ కనుగోలు ఐటీసీ కోహినూర్‌లో భేటీ అయ్యారని తెలిపారు. గౌతమ్ ఆదానీని అడ్డం పెట్టుకుని ఈడీ కేసుల నుంచి పొంగులేటి బయటపడే ప్రయత్నం చేస్తున్నారా అని ప్రశ్నించారు. బీజేపీతో అంటకాగే వ్యాపారవేత్తతో కాంగ్రెస్ నేతలకు ఏం పని అని అడిగారు. ప్రభుత్వపరమైన మీటింగ్ అయితే హోటల్‌లో ఎందుకు కలిశారని నిలదీశారు. హైడ్రా విషయంలో హైకోర్టు హెచ్చరించినా సీఎం రేవంత్ రెడ్డి ఆర్డినెన్స్ తెచ్చారన్నారు. బీజేపీ గవర్నర్ హైడ్రా ఆర్డినెన్స్‌కు ఆమోదం తెలిపారని అన్నారు. కేటీఆర్‌ను టార్గెట్ చేసి దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. కేటీఆర్, హరీష్ రావులపై దాడులు చేస్తామని మైనంపల్లి అంటున్నారన్నారు. మూసీ సుందరీకరణపై పాలసీ డాక్యుమెంట్ ఉందా అని ప్రశ్నించారు. మూసీ సుందరీకరణపై పరివాహక ఎమ్మెల్యేలతో మీటింగ్ ఎందుకు పెట్టలేదని అడిగారు. జీహెచ్ఎంసీకి సంభంధం లేకుండా రేవంత్ రెడ్డి హైడ్రాను పెట్టుకున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి నష్టం చేస్తున్నారంటూ దాసోజు శ్రవణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు

# ప్రభావం చూపగలడా?

బీహార్:మరో ఏడాదిలో అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లనున్న బీహార్‌లో కొత్త రాజకీయ పార్టీ పుట్టుకొచ్చింది. రాజకీయ వ్యూహకర్తగా పనిచేసి, తర్వాత రాజకీయ నాయకుడిగా మారిన ప్రశాంత్ కిశోర్.. చెప్పినట్టుగానే తన జన్ సూరజ్ మూవ్‌మెంట్‌ను.. జన్ సూరజ్ పార్టీగా బుధవారం పాట్నాలోని వెటర్నరీ కాలేజీ మైదానంలో నిర్వహించిన సభలో ప్రకటించారు. ఈ సందర్భంగానే ఇండియన్ ఫారిన్ సర్వీస్ మాజీ అధికారి మనోజ్ భారతిని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రకటించి అందరినీ ఆశ్చర్యపర్చారు. భారతి ఐఐటియన్. దళితుడు. బీహార్‌లోని మధుబని జిల్లాకు చెందినవారు. 'ఈ రోజు ఆయన ఒక దళితుడిగా ఇక్కడ లేరు. ప్రశాంత్ కిశోర్ కంటే మెరుగైన వ్యక్తి కావడంతోనే ఆయనను ఎంపిక చేశాం. ఆయన దళితుడు కావడం యాదృచ్ఛికం' అని ప్రశాంత్ కిశోర్ పాట్నా సభలో చెప్పారు. రాష్ట్రంలో మద్య నిషేధాన్ని ఎత్తివేయడం తమ అజెండాలో ఒక కీలక అంశమన్నారు. మద్య నిషేధం కారణంగా బీహార్ ఏటా 20వేల కోట్ల రూపాయలను నష్టపోతున్నదని, తాము మద్య నిషేధాన్ని ఎత్తివేసి, ఆ డబ్బును ఉత్తమ విద్య, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వినియోగిస్తామని ప్రకటించారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని వ్యవసాయ రంగానికీ అమలు చేయడం ద్వారా రైతులకు సహకరిస్తామని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు పావలా వడ్డీకే రుణాలు అందిస్తామని ప్రకటించారు. వృద్ధులకు నెలకు 2వేల రూపాయలు పెన్షన్ ఇస్తామని చెప్పారు.ప్రస్తుతం బీహార్‌లో బీజేపీ-జేడీయూ ఐక్య కూటమి అధికారంలో ఉన్నది. మరోవైపు రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ), కాంగ్రెస్ కలిసి మహాఘట్‌బంధన్‌గా ఉన్నాయి. గాంధీ జయంతి రోజున ఆవిర్భవించిన జన్ సూరజ్ పార్టీ రాకతో రాష్ట్రంలో ఏ కూటమికి సవాలుగా మారుతుందనేది కీలక అంశంగా ఉన్నది. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు మాత్రం జన్ సూరజ్ పార్టీ ప్రభావం నామమాత్రంగానే ఉంటుందని అంటున్నాయి. గతంలో ప్లూరల్స్ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ బీహార్ రాజకీయాల్లోకి వచ్చి విఫలమయ్యాయని బీజేపీ అధికార ప్రతినిధి ప్రేమ్ రంజమ్ పటేల్ అన్నారు. బీజేపీ మాజీ ఎమ్మెల్యే సంజయ్ సింగ్ టైగర్.. నోటాకు ఎన్ని ఓట్లు వస్తాయో జన్ సూరజ్ పరిస్థితి కూడా అంతేనని తేల్చిపారేశారు. ప్రశాంత్ కిశోర్‌ను బీజేపీకి బీ టీమ్ అని గతంలో ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ అభివర్ణించారు. ముస్లింలు, యాదవులు ప్రశాంత్ కిశోర్ వైపు మొగ్గు చూపుతారని తాను అనుకోవడం లేదని ఆర్జేడీ సీనియర్ నేత అబ్దుల్ బారి సిద్ధిఖీ చెప్పారు. మహాఘట్‌బంధన్ నుంచి లేదా ఎన్డీయే కూటమి నుంచి టికెట్లు లభించనివారికి అదొక వేదికగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. 2025 అసెంబ్లీ ఎన్నికలు రెండు ప్రధాన కూటముల మధ్య ఉంటాయని, జన్ సూరజ్ నామమాత్రమేనని జేడీయూ అధికార ప్రతినిధి రాజీవ్ రంజన్ చెప్పారు. కొత్త పార్టీ పెడతానని జూలై నెలలో ప్రకటించిన ప్రశాంత్ కిశోర్.. తమ పార్టీ రాష్ట్రంలోని మొత్తం 243 సీట్లలో పోటీ చేస్తుందని చెప్పారు.

## సంక్షేమ పథకాల కోసమే డిజిటల్ కార్డులు

హైదరాబాద్, సంక్షేమ పథకాల అమలు కోసం డిజిటల్ కార్డులు అవసరమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ సిక్ విలేజ్ ప్రాంగణంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న డిజిటల్ కార్డులను గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... సంక్షేమ పథకాలు అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో కుటుంబ డిజిటల్ కార్డులు ప్రవేశపెట్టినట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు.గత కేసీఆర్ ప్రభుత్వంలో రేషన్‌కార్డు కోసం పదేళ్లు ప్రజలు ఆఫీసుల చుట్టూ తిరిగారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ అధికారంలో ఉంటే రేషన్‌కార్డు రాదని కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని తెలిపారు. కొత్త రేషన్‌కార్డులు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదని అన్నారు. ప్రతి పేదవాడికి ఈ కార్డు ఇవ్వాలన్న లక్ష్యంతో ఉన్నామని తెలిపారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు కుటుంబానికి రక్షణ కవచమని అన్నారు. కార్డులో కుటుంబానికి సంబంధించిన వివరాలు ఉంటాయని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికీ గుర్తింపు నెంబర్ ఇచ్చి పథకాలు అమలు చేస్తామని తెలిపారు. ఆస్పత్రి రిపోర్టులు కూడా కార్డులోనే డిజిటల్‌గా ఉంటాయని చెప్పారు.

# డీజీపీ సంచలన నిర్ణయం..



హైదరాబాద్,డ్రగ్స్ సమస్యపై హిమాచల్ ప్రదేశ్ పోలీస్ చీఫ్ భారీ ప్రకటన చేశారు. తక్కువ మొత్తంలో డ్రగ్స్‌తో పట్టుబడిన వారిని నేరస్థులుగా పరిగణించబోమని చెప్పారు.వారు మెరుగుపరచుకోవడానికి అవకాశం కల్పిస్తారు. ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదైన కేసులు అనేక రెట్లు పెరగడమే ఇందుకు కారణమని అన్నారు. 2014లో 644 కేసులు నమోదు కాగా.. 2023 నాటికి వాటి సంఖ్య 2,147కు పెరుగుతుందని చెప్పారు. శిక్ష తగ్గించడం లేదని దీన్నిబట్టి తెలుస్తోంది.పోలీసుల డేటా ప్రకారం.. 2023లో ఎన్‌డిపిఎస్ చట్టం కింద 103 మంది మహిళలు, 6 మంది విదేశీయులతో సహా 3118 మందిని అరెస్టు చేశారు. వీరిలో 200 నుంచి 250 వరకు మాత్రమే వాణిజ్య పరిమాణంలో మందులు ఉన్నాయి. ఈ మాదకద్రవ్యాలకు బానిసలైన వారిలో ఎక్కువ మంది స్మగ్లర్లు, తదుపరి మోతాదు కోసం ఈ పని చేస్తారని అధికారి తెలిపారు. డీజీపీ అతుల్ వర్మ గురువారం పీటీఐతో మాట్లాడుతూ.."వీరిలో కొందరు డ్రగ్స్‌కు బానిసలైన నేరస్థులు కాదు. దీంతో వారు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఎన్‌డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 64%ూ% ప్రకారం వారిని సంస్కరించడానికి అవకాశం ఇవ్వాలి. ఇది చిన్న పరిమాణంలో నిషేధిత పదార్థంతో పట్టుబడిన మాదకద్రవ్యాల బానిసలకు ప్రాసిక్యూషన్ నుంచి రోగనిరోధక శక్తిని అందిస్తుంది. రాష్ట్రంలో ఈ నిబంధన ఎప్పుడూ ఉపయోగించలేదు." అని స్పష్టం చేశారు. డ్రగ్స్ బానిసల గుర్తింపు ప్రక్రియ ప్రారంభించామని డీజీపీ తెలిపారు. సెక్షన్ 14Aకి సంబంధించి ఎన్జీవోలు, రిటైర్డ్ అధికారులు అవగాహన ప్రచారంలో నిమగ్నమై ఉంటారు. వైద్య చికిత్స ద్వారా అతను మెరుగుపడటానికి అవకాశం ఇవ్వబడుతుంది.

# హర్యానాలో బిజెపి కోసం ఓట్లడిగి 2గంటల్లో కాంగ్రెస్ లోకి



హర్యానా:అశోక్ తన్వర్ హర్యానాలోని సిర్సా మాజీ ఎంపీ. మహేందర్ గఢ్ లో గురువారం ఎన్నికల ర్యాలీ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, భూపేందర్ సింగ్ హుడా సమక్షంలో ఆయన తిరిగి కాంగ్రెస్ లో చేరారు.ఒకప్పుడు తన్వర్ హర్యానా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు. కానీ 2019లో పతనం అయ్యాక రాజీనామా చేశారు. తర్వాత ఆయన 2021లో తృణమూల్ కాంగ్రెస్ లో చేరారు. ఈ ఏడాది మొదటి భాగంలో భారతీయ జనతా పార్టీ(బిజెపి)లో చేరారు. బిజెపిలో చేరాక ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో దేశం ఓ మార్పును చూస్తోందని పొగిడారు.విశేషమేమిటంటే జింద్ జిల్లాలోని సఫిదాన్ లో బిజెపి అభ్యర్థికి ప్రచారం చేశాక కాంగ్రెస్ లో చేరారు. రాహుల్ గాంధీ తన ప్రసంగాన్ని ముగించాక, ప్రేక్షకులను కొన్ని నిమిషాలు ఆగమని కోరారు. తర్వాత తన్వర్ వేదిక మీదికి వెళ్లారు. "నేడు ఆయన తిరిగి తన స్వంత గూటికి చేరుకున్నారు"( ఆజ్ ఉన్కి ఘర్ వాపసీ హెూ గయీ) అని ప్రకటించారు. ఆయన రాహుల్ గాంధీ, భూపేందర్ సింగ్ హుడాతో కరచాలనం చేశారు.తన్వర్ 2009 లోక్ సభ ఎన్నికల్లో ఐఎన్ఎల్ డి అభ్యర్థి సీతారామ్ ను 34499 ఓట్ల తేడాతో ఓడించారు. అయితే 2014లో ఐఎన్ఎల్ డి అభ్యర్థి చరణ్ జతీత్ సింగ్ రోరి చేతిలో 1.15 లక్షల ఓట్ల తేడాతో ఓడిపోయారు. తర్వాత 2019లో కూడా ఆయన బిజెపి అభ్యర్థి సునీతా దుగ్గల్ చేతిలో 3 లక్షల ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఆ విధంగా ఆయన పతనం కొనసాగింది. ఇప్పుడు ఆయన మళ్లీ కాంగ్రెస్ లో చేరడంతో కాంగ్రెస్ బలాన్ని తిరిగి పునరుద్ధరిస్తారని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ను గెలిపిస్తారని కాంగ్రెస్ ఆశాభావంతో ఉంది.

### ఓటర్ల తుది జాబితా విడుదల

హైదరాబాద్, పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. రాష్ట్రంలోని 33 జిల్లాల పరిధిలో 12,867 పంచాయతీల్లో 1,67,33,584 మంది ఓటర్లున్నట్టు తెలిపింది. ఇందులో 82,04,518 పురుషులు, 85,28,573 మహిళలు, 493 ఇతరులు ఉన్నారని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో పురుషుల కన్నా మహిళలే అత్యధికంగా ఉన్నట్టు ఈసీ గణాంకాలు చెబుతున్నాయి.

# ఆశయం ఉత్తమం! ఆచరణలో ఆటంకాలు

హైదరాబాద్,ఒక మంచి కార్యక్రమం సమన్వయ లోపం, స్వార్థపూరిత ప్రయోజనాలు, ఈర్ష్య, అసూయ, ద్వేషాలతో ఎలా నీరుకారిపోయే ప్రమాదం ఉందో చెప్పడానికి తాజా ఉదాహరణ హైడ్రా!.. కోటి రత్నాల వీణ తెలంగాణలో నీటి వనరులను పరిరక్షించడానికి, తద్వారా సహజసిద్ధమైన చెరువులను కాపాడి పర్యావరణ హితంగా రాష్ట్రాన్ని మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఉదాత్త ఆశయంతో హైడ్రా వ్యవస్థను రూపొందించింది. తగిన యంత్రాంగాన్ని సమకూర్చి ఆక్రమణలను తొలగించడానికి ఉపక్రమించింది. అక్రమార్కులు నిర్మించిన పలు భవంతులనే కాకుండా వాణిజ్యపరంగా ఉపయోగిస్తున్న అనేక షెడ్లు, కట్టడాలను ఇప్పటికే తొలగిం చింది. అయితే, వీటిలో ఎక్కడా నివాస గృహాలు లేవు. అప్పటికే నిర్మించిన లేదా నిర్మాణంలో ఉన్న భవనాలను, ఇతర కట్టడాలను మాత్రమే హైడ్రా కూల్చింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా దేశవ్యాప్తంగా అనుకూల వాతావరణం ఏర్పడింది. తమకూ ఇటువంటి వ్యవస్థలను ఏర్పాటు చేయాలని తెలంగాణలోని ఇతర రాష్ట్రాల నుంచే కాకుండా, పొరుగు రాష్ట్రాల్లో కూడా డిమాండ్లు వెల్లువెత్తాయి. పర్యావరణ హిత సామాజికవాదులు, పలువురు మేధావి వర్గాల వారు తమ సంపూర్ణ మద్దతుతో హర్షాతిరేకాలను వ్యక్తం చేశారు.

పరపతి పోతోందనే ఈర్ష్యా..

సరిగ్గా ఇక్కడే అసలు సమస్య ప్రారంభమైంది. అక్రమార్కులతో పాటు హైడ్రా వ్యవస్థతో నష్టపోతున్న, తమ పరపతి తగ్గిపోతోందని ఈర్ష్యా అసూయతో రగిలిపోయిన కొన్ని వ్యవస్థల ఉన్నతాధికారులు ఒక్కటయ్యారు. అంతే కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలన్నట్టు తయారైంది హైడ్రా పరిస్థితి. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే హైడ్రాకు నేతృత్వం వహిస్తున్న ఐపీఎస్ అధికారికి వస్తున్న మంచి పేరు కొన్ని ఇతర వ్యవస్థల ఐఏఎస్, ఇతర బ్యూరోక్రాట్లకు కంటగింపుగా మారిందని సామాజిక పరిశీలకులు భావిస్తున్నారు. సహజంగానే ఐఏఎస్, ఐపీఎస్‌ల మధ్య కంటికి కనిపించని ఘర్షణ వాతావరణం నెలకొని ఉంటుందన్నది వారి వాదన. హైడ్రా వ్యవహారంతో అది మరోమారు తెరపైకి వచ్చిందని వారి విశ్లేషణ. అయితే, అందరు ఐఏఎస్‌లు లేదా ఐపీఎస్‌లు ఈవాదనను అంత తేలిగ్గా అంగీకరించకపోవచ్చు! వారిలో అత్యధికులు సమాజహితం కోసం ఎంతైనా పాటుపడుతున్న వారే. ఇందులో ఎటువంటి సందేహం లేదు. అయితే, కడివెడు పాలలో చిటెకెడు ఉప్పు చాలన్నట్టు ప్రస్తుత వ్యవస్థలో లొసుగులు మొత్తం ప్రభుత్వ లక్ష్యాలనే నీరుగార్చేస్తున్నాయని మేధావి వర్గాలు కూడా అంటున్నాయి.

కుట్రలు, కుతంత్రాలు..

ఇప్పుడీ వ్యవహారంలో హైడ్రాకు అనేక అడ్డంకులు సృష్టించబడ్డాయని సమాజ హితైషులు వాపోతున్నారు. హైడ్రా ఏర్పాటు తర్వాత పెద్దగా పట్టించుకోని పైన చెప్పుకున్న కొందరు బ్యూరోక్రాట్లు, అక్రమార్కులకు మితిమీరిన దాహంతో పాటు ఎడాపెడా మేతమేస్తున్న ఆయా వ్యవస్థల్లోని మధ్య, కింది స్థాయి ఉద్యోగులు జత కలిశారు. కుట్రలు, కుతంత్రాలకు తెరలేపాయి. అసలు హైడ్రా వ్యవస్థలోనే లేని నోటీసుల అంశాన్ని పాశుపతాస్త్రంగా ప్రయోగించారు. నోటీసులు ఇచ్చే అధికారం కాని, వ్యవస్థ కాని లేని హైడ్రాకు తలనెప్పిగా దీన్ని మార్చేశారు. ఇదే సమయంలో ప్రభుత్వం ఆపరేషన్ మూసీ అంశాన్ని ఆరంభించింది. ఇది కూడా భాగ్యనగరంతో పాటు రాష్ట్ర బంగారు భవిష్యత్‌కు ఎంతో ఉపయోగపడుతుందనే ముఖ్య ఉద్దేశంతోనే ప్రభుత్వం చేపట్టింది. కుట్రలు, కుతంత్రాల్లో ఆరితేరిన ఆయా బ్యూరోక్రాట్లు,




అక్రమార్కులు, కొసరు ఆదాయమే ఊపిరిగా బతుకుతున్న మధ్య, కిందిస్థాయి అధికారులు ఆయా వ్యవస్థల నుంచి ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖలోని కొన్ని వర్గాలు ఎడాపెడా నోటీసులు జారీ చేసి, అదంతా హైడ్రా మీదకు నెట్టేశారు. అవకాశం కోసం ఎదురుచూస్తున్న కొందరు దీనికి రాజకీయ రంగు కూడా పులిమేశారు. అంతే%ా% ఎప్పుడు ఏది తెరపైకి వస్తే దాన్ని విపరీతంగా ట్రోలింగ్ చేసే సోషల్ మీడియా రచ్చ రచ్చ చేసేసింది.

అందులో భాగంగానే విమర్శలు..

ఇవన్నీ ఒక ఎత్తయితే, ఇదే సమయంలో వెలువడిన న్యాయవ్యవస్థ వ్యాఖ్యానాలు కూడా హైడ్రాకు మరిన్ని చిక్కులు తెచ్చిపెట్టాయంటున్నారు. చట్టప్రకారమే వ్యవహరిస్తున్నప్పటికీ, జరుగుతున్న వ్యవహారాలన్నీ హైడ్రాకు ఆపాదించడంతో కనిపిస్తున్న ఆధారాలపైనే న్యాయవ్యవస్థ కూడా స్పందిస్తుంది. న్యాయవ్యవస్థపై అపార గౌరవంతో ఉన్న సభ్య సమాజం ఇప్పుడు ఆలోచనలోపడింది. హైడ్రా నిజంగానే దూకుడుతో వ్యవహరిస్తోందని భావిస్తోంది. అక్రమంగానే ఆయా నిర్మాణాలను కూల్చి వేస్తోందని నమ్మే పరిస్థితికి వచ్చేసింది. పైగా బడాబాబులకు నోటీసులు ఇస్తూ, పేద, మధ్య తరగతికి చెందిన సామాన్యుల ఇళ్లనే కూల్చివేస్తున్నారన్న రాజకీయ విమర్శలు కూడా ఇందుకు తోడయ్యాయి. ఈ నేపథ్యంలో హైడ్రా భవిష్యత్‌పైనే నీలినీడలు వ్యాపించాయి.

వ్యవస్థలు, ఉన్నతాధికారుల మధ్య సమన్వయ లోపం..

ప్రభుత్వాలు మంచి కార్యక్రమాలు చేపట్టడం, తగిన వ్యవస్థలను రూపొందించడం, సమర్ధ అధికారులను నియమించడమే కాదు, ఆయా వ్యవస్థలు, ఉన్నతాధికారుల మధ్య సమన్వయం కూడా చూడాల్సిన బాధ్యత ఉందని దీంతో మరోసారి తేలిపోయిందని విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఇందుకు సంబంధించి మరింత స్పష్టమైన, సవివరణలతో అన్ని వర్గాల ప్రజలకు తెలియపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచిస్తున్నారు. అలాగే, ఏదైనా ఒక కార్యక్రమం రూపొందించినప్పుడు ఎవరిదారిన వారు వ్యవహరించకుండా సమష్టిగా ఎలా ముందుకు పోవాలన్న అంశాలపై ముందుగానే కార్యాచరణ రూపొందించుకోవాలని, ఇందుకు ప్రభుత్వమే పూనుకుని అన్ని వ్యవస్థల ఉన్నతాధికారులతో సమన్వయ సమావేశాలను తరచూ నిర్వహిస్తూ లోపాలను సరిదిద్దుకుంటే, హైడ్రా వంటి ఉన్నత స్థాయి వ్యవస్థలతో మహెూన్నత కార్యక్రమాలను మరింత సమర్ధంగా అమలు చేయవచ్చునని సామాజిక నిపుణులు సూచిస్తున్నారు. అలాగే, ఆయా కార్యక్రమాలను చేపట్టే ముందుగానే అందుకు సంబంధించి పబ్లిక్ ఎవేర్‌నెస్ కార్యక్రమాలను చేపట్టాలని కూడా అంటున్నారు.

# కేటీఆర్ ఏకాకి అయ్యారా.. బీఆర్ఎస్ నేతలు మాత్రం మౌనం!

హైదరాబాద్,అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్న నానుడి మాదిరిగానే.. కొన్ని సార్లు మన వెంట అందరూ ఉన్నా.. కష్టాల సమయంలో హాయ్ అనే పలకరింపు కూడా మనకు వినిపించదు. దీనికి ఎన్నో కారణాలు ఉండొచ్చు.. మన కష్టం వారికి కష్టాలు తెస్తుందేమోనన్న భావన కూడా వారిలో ఉండొచ్చు. లేక మన మీద ఈర్ష్య, అసూయ కూడా ఉండొచ్చు. ఏదిఏమైనా ప్రస్తుతం మాజీ మంత్రి కేటీఆర్ ను చూస్తే.. అందరూ ఉన్నా ఈ మాజీ మంత్రికి మద్దతు తెలిపే వారే కరువయ్యారు. సోషల్ మీడియా ట్రోలింగ్ పుణ్యమా అంటూ.. బీఆర్ఎస్ కు అన్నీ చిక్కులే వస్తున్నాయని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. దీనికి ప్రధాన కారణం మంత్రి కొండా సురేఖ వర్సెస్ కేటీఆర్ మాటల వైరమే.తెలంగాణ మంత్రి కొండా సురేఖ లక్ష్యంగా ఇటీవల సోషల్ మీడియా ట్రోలింగ్ ఏ రీతిలో సాగిందో తెలిసిందే. అయితే ఈ ట్రోలింగ్ వెనుక మాజీ మంత్రి కేటీఆర్ ఉన్నట్లు మంత్రి కొండా ఆరోపణ. చివరికి ట్రోలింగ్ ధాటికి మీడియా సమావేశంలో కొండా సురేఖ కన్నీటి పర్యంతమయ్యారు. గతంలో ఇదే రీతిలో మంత్రి సీతక్క మీద కూడా ట్రోలింగ్ సాగగా.. సాక్షాత్తు సీఎం రేవంత్ అసెంబ్లీలో బీఆర్ఎస్ పై శివాలెత్తారు.ఇలా తనపై జరిగిన ట్రోలింగ్ పై తీవ్ర అవేదన చెందిన మంత్రి కొండా మానసిక వ్యథతో చేసిన వ్యాఖ్యలు పెను దుమారం లేపాయి. హీరో నాగార్జున ఫ్యామిలీ విషయాన్ని మీడియా ముందు మాట్లాడడం.. అలాగే హీరోయిన్ సమంతాను వివాదంలోకి లాగడం, ఈ ఫ్యామిలీ విభేదాలకు, కేటీఆర్ కు సంబంధం ఉందనడం సంచలనంగా మారింది. అలాగే ఎందరో హీరోయిన్లు కెరీర్ ను వదిలి.. త్వరగా పెళ్లి చేసుకోవడానికి కారణం కేటీఆర్ అంటూ సురేఖ ఘాటుగానే విమర్శించారు. అంతటితో ఆగక డ్రగ్స్ అలవాటు కూడా కేటీఆర్ కి ఉందని పొలిటికల్ బాంబ్ విసిరి వేశారనే చెప్పవచ్చు.మంత్రి చేసిన వ్యాఖ్యలకు విమర్శలు ఇంతింతై వటుడింతై అన్నట్లుగా ఊపందుకున్నాయి. సోషల్ మీడియా మొత్తం మార్మోగింది. ఎక్కడ చూసినా ఇదే చర్చ.. ఇదే రచ్చ. చివరకు హీరో నాగార్జున తొలుత స్పందించారు. ఆ తరువాత టాలీవుడ్ మొత్తం నాగార్జునకు మద్దతు పలికిందని చెప్పవచ్చు. మెగాస్టార్ చిరంజీవి మొదలు.. టాప్ హీరోలు, అప్ కమింగ్ హీరోలు,



హీరోయిన్స్, ఇలా ఒకరేమిటి అందరూ నాగార్జున ఫ్యామిలీకి అండగా నిలిచి, మినిస్టర్ సారీ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధిష్టానం, సీఎం రేవంత్ జోక్యంతో మంత్రి సారీ చెప్పారు. ఇక్కడి వరకు ఓకే కానీ అసలు మంత్రి కొండాను రెచ్చగొట్టిన బీఆర్ఎస్ నేతలు ఒక్కసారిగా సైలెంట్ కావడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.నాగార్జున ఫ్యామిలీ గురించి మాట్లాడి సారీ చెప్పిన మంత్రి సురేఖ.. కేటీఆర్ పై మాత్రం తగ్గేదే లేదని పునరుద్ఘాటించారు. ఇక్కడే సాక్షాత్తు బీఆర్ఎస్ పార్టీలో నెంబర్-2 గా గల కేటీఆర్ పై మంత్రి చేసిన విమర్శలకు బీఆర్ఎస్ నేతలు ఎవరూ స్పందించక పోవడం విశేషం. అసలు ఫోన్ ట్యాపింగ్ తో హీరోయిన్ లను వేధించారని మంత్రి కామెంట్ చేయగా.. ఈ విషయంపై బీఆర్ఎస్ ముఖ్యనేతలెవరూ నోరు మెదపలేదు.ఒకవేళ చిన్నగా టాలీవుడ్, మంత్రి మధ్య వార్ జరుగుతోంది మనం సైడ్ అవుదామని అనుకున్నారా.. లేక మనకెందుకు ఈ రచ్చ అని సైలెంట్ అయ్యారా అంటూ ఇప్పుడు విశ్లేషకుల మధ్య చర్చ జోరుగా సాగుతోంది. కేటీఆర్ ఒక మాట అంటే ఊరుకోని బీఆర్ఎస్ కీలక నేతలు ఎందుకు సైలెంట్ అయ్యారనేది పెద్ద ప్రశ్నగా మిగిలిందని చెప్పవచ్చు. ఏది ఏమైనా నాగార్జున ఫ్యామిలీపై చేసిన వ్యాఖ్యలు వెనక్కు తీసుకున్న మంత్రి.. కేటీఆర్ పై చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించి వార్ కు రెడీ అన్నట్లు సంకేతం ఇచ్చారన్న భావన వినిపిస్తోంది.

# రైతాంగానికి అండగా రేవంత్ ప్రభుత్వం



సిద్దిపేట, తల తాకట్టు పెట్టి అయినా రైతాంగానికి అండగా ఉంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. త్వరలోనే రూ. 2 లక్షల రుణ మాఫీని పూర్తిచేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గురువారం నాడు గజ్వేల్ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన మంత్రి తుమ్మల గత ప్రభుత్వాలు రైతు రుణమాఫీపై మాట కూడా మాట్లాడలేదు. దేశంలో ఏ రైతు పండించని పంటలు మన రైతులు పండిస్తున్నారు. ప్రతి గింజను మార్కెట్ ధర కంటే ఎక్కువకు ప్రభుత్వమే కొని రైతులను ఆదుకుంటాం. రైతును దగా చేసిన వాళ్ల మాటలు నమ్మవద్దు. మేము ఇచ్చిన హామీలన్నింటినీ పూర్తిగా అమలు చేస్తాం. సంవత్సరం లోపు రూ. 300 కోట్లతో జిల్లాలో పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ ఓపెన్ చేస్తాం అన్నారు. పామ్ ఆయిల్‌లో రాష్ట్రంలో, దేశంలోనే సిద్దిపేట జిల్లా మొదటిస్థానంలో ఉండాలి. ఇతర దేశాల నుండి లక్ష కోట్లు పెట్టు ఆయిల్ కొంటున్నాము. ఇప్పటికే 11 వేల ఎకరాలు సాగు అవుతుంది. ఇంకా 11 వేల ఎకరాలకు పెంచాలి. భారత దేశానికి కావలసిన ఆయిల్ మొత్తం తెలంగాణ ఇస్తుందని రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి చెప్పారని మంత్రి తుమ్మల చెప్పుకొచ్చారు. రైతాంగానికి ఎక్కడ ఇబ్బంది వచ్చినా వారికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మరోమంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు 1వ తేది నుండి అందుబాటులోకి వస్తాయి. గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ అనేక అబద్ధపు హామీలు ఇచ్చారు. నాటి ప్రభుత్వంలో ప్రజలను ఇబ్బందులకు గురి చేసే విధంగా రాచరికపు నిర్ణయాలు తీసుకున్నారు. శాసన సభ్యునీ హోదాలో ఇంత వరకు నియోజకవర్గంలో అడుగుపెట్టలేదు. బీజేపీ, బీఆర్ఎస్ రైతు వ్యతిరేఖ చట్టాలు తీసుకువచ్చాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు రైతాంగం అండగా ఉంది. గత ప్రభుత్వం రైతాంగానికి ఇవ్వవలసిన పనిముట్లను వాళ్ళ కార్యకర్తలకు ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆ విధంగా కాకుండా చిన్న, సన్నకారు రైతులకే వ్యవసాయ పనిముట్లు అందజేస్తాం అని మంత్రి పొన్నం ప్రభాకర్ రైతులకు భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్, బీజేపీలపై మంత్రి కొండా సురేఖ సంచలన ఆరోపణలు చేశారు. కవిత కోసం బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఒప్పందాలు జరిగాయని.. అందుకే ఆమె బెయిల్‌పై బయటకు వచ్చారన్నారు. గజ్వేల్ ప్రజలు అనుకుంటే ఏదైనా సాధిస్తారని నమ్మకం ఉంది. మెదక్ ఎంపీ అభ్యర్థిగా బీజేపీని గెలిపించేందుకు బీఆర్ఎస్.. బీజేపీతో చీకటి ఒప్పందం చేసుకుంది. ఎంపీలుగా బీజేపీని గెలిపిస్తామని, కవితని వదిలిపెట్టాలని ముందే అమిత్ షాతో ఒప్పందం చేసుకున్నారు. ప్రజలకు ఏ విధంగా సేవ చేయాలా అని మేము చూస్తుంటే.. బీఆర్ఎస్ పార్టీ మాత్రం ప్రజలను తప్పు దారి పట్టిస్తోంది. సోషల్ మీడియా ద్వారా తప్పుడు వార్తలు, రాతలు రాపిస్తూ కేటీఆర్ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన ప్రతిపక్షం ఇంతవరకు నియోజకవర్గంలో కానీ, అసెంబ్లీలో కానీ అడుగుపెట్టలేదు. గజ్వేల్ ఎమ్మెల్యే ఉన్నాడా లేదా అనేది ప్రశ్నగా ఉంది. ప్రభుత్వానికి సూచనలు ఇవ్వాలి కానీ అడ్డుపడితే ఊరుకునేది లేదని అంటూ విపక్షాలకు మంత్రి మాస్ వార్నింగ్ ఇచ్చారు.

# ఇజ్రాయెల్ లో భారతీయులు ఎందరు?

న్యూఢిల్లీ,ప్రపంచంలోని ఏ మారుమూల దేశానికి వెళ్లినా అక్కడ ఏదేశం వారు ఉన్నా లేకున్నా భారతీయులు పక్కాగా ఉంటారు. భారతీయులు అన్నంతనే తెలుగు వారు ఖాయంగా ఉండటం కనిపిస్తుంది. అలా ఏ దేశంలో అయినా తెలుగోళ్ల నెట్ వర్కు ఉంటుందని చెప్పాలి. మారుమూల దేశాల్లోనే ఉండే భారతీయులు.. తెలుగువారు ఉన్నప్పుడు పశ్చిమాసియాలోని కీలక దేశమైన ఇజ్రాయెల్ లో భారతీయులు భారీగా ఉంటారు. తెలుగువారి సంఖ్య కూడా ఎక్కువే.తాజాగా ఇరాన్ – ఇజ్రాయెల్ మధ్య యుద్ధం నడుస్తున్న వేళ మనోళ్ల సంగతి మీద ఆందోళన వ్యక్తమవుతోంది. అక్కడున్న మనోళ్లు ఎలా ఉన్నారు? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది. ఇజ్రాయెల్ లోని భారత రాయబార కార్యాలయం అందిస్తున్న సమాచారం ప్రకారం ప్రస్తుతం ఆ దేశంలో మొత్తం 18 వేల మంది భారతీయ పౌరులు ఉన్నట్లుగా పేర్కొన్నారు.ఇంతమంది ఇజ్రాయెల్ లో ఏం చేస్తారు? అన్న విషయంలోకి వెళితే.. ఆ దేశంలో మనోళ్లు ఎక్కువగా డైమండ్ ట్రేడర్స్.. ఐటీ ప్రొఫెషనల్స్, వ్యాపారులుగా ఉంటారు. కేర్ టేకర్స్ గా కూడా వ్యవహరిస్తూ ఉంటారని చెబుతున్నారు. ఆసక్తికరమైన అంశం ఏమంటే.. భారత సంతతికి చెందిన యూదులు కూడా భారీగానే ఉన్నారు.ఒక అంచనా ప్రకారం 85 వేల మంది భారత సంతతి యూదులు నివసిస్తున్నట్లుగా తెలుస్తోంది. అంతేకాదు.. వేలాది భారతీయుల్లో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన తెలుగు వారు ఎక్కువగానే ఉన్నారు. ఉద్యోగ.. విద్య అవకాశాల కోసం ఆ దేశంలో ఉన్నట్లు తెలుస్తోంది.నిజానికి ఇజ్రాయెల్ నిర్మాణ రంగంలో పని చేయటానికి గతంలో పాలస్తీనా నుంచి రోజు 18 వేల మంది కార్మికులు వచ్చి వెళుతుండేవారు. కానీ హమాస్ దాడి తర్వాత నుంచి వారిని పనికి తీసుకోవటం ఇజ్రాయెల్ ఆపేసినట్లుగా మనోళ్లు చెబుతున్నారు. వారికి బదులుగా మనోళ్లను.. శ్రీలంక పైరుల్నిపనికి తీసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. యుద్ధం ముదిరే కొద్దీ.. ఇంత భారీగా ఉన్న భారతీయుల యోగక్షేమాలు.. వారిని స్వదేశీనికి తీసుకురావటం తలకు మించిన భారంగా మారుతుంది. వీలైనంత త్వరగా యుద్ధం ముగియటం



ఇరాన్.. ఇజ్రాయెల్ కు మాత్రమే కాదు మనకు కూడా చాలా అవసరమని చెప్పాలి.

### సుప్రీం తీర్పుకు భిన్నంగా రేవంత్ వైఖరి

హైదరాబాద్, సుప్రీం కోర్టు ఆగస్ట్ 1వ తేదీన ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పునకు సీఎం రేవంత్ రెడ్డి విరుద్ధంగా వ్యవరిస్తున్నారని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ చేసే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని సుప్రీం కోర్టు చెప్పిందని తెలిపారు. ఆ తీర్పు వెలువడిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి స్పందించారని.. ... అందరికన్నా ముందు తీర్పును స్వాగతించారని గుర్తుచేశారు. డీఎస్సీ ఫలితాలు విడుదల చేశారని .. 9 వ తేదీన నియామక పత్రాలు ఇస్తామన్నారని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన తర్వాత డీఎస్సీ పరీక్షలు జరిగాయని చెప్పారు. డీఎస్సీ ఫలితాలు ప్రకటించారని.. వర్గీకరణ విసయంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. చట్ట సభలో ఇచ్చిన మాటకి విరుద్ధంగా చేస్తున్నారని మండిపడ్డారు. సుప్రీం తీర్పు అనంతరం పంజాబ్ , తమిళనాడు ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తుందని తెలిపారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com